



మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

ఉపమాకలో కన్నుల పండువగా వెంకన్న కల్యాణం



ఉభయ దేవేరులతో వేంకటేశ్వరుడు

- పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించిన అర్చకులు
- గోవిందనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- భక్తులతో కలిసి కల్యాణోత్సవాన్ని తిలకించిన హోం మంత్రి అనిత

నక్కపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వివిధ ఘట్టాలను ఆలయ ఆచార వ్యవహారాల మేరకు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకను కనులారా వీక్షించి, భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

వేంకటేశ్వరస్వామి కల్కి అవతారంలో కొలువైన ఉపమాక క్షేత్రం శ్రీవారి వార్షిక కల్యాణశోభతో కళకళలాడింది. సోమవారం రాత్రి ఎదురుసన్నాహ మహోత్సవంలో భాగంగా ఉపమాక మాడవీధుల్లో సింహాద్రాచార్యులు ఇంటి వద్ద పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి కల్యాణం ... మిగతా 8వ పేజీలో



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నిమ్మకాయలకు గిరాకీ

- వేసవి ఆరంభంతో పెరిగిన డిమాండ్
- తోటల వద్దకే వచ్చి కిలో రూ.100-120కి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



కోటవురట్లలో వ్యాపారులు కొనుగోలు చేసిన నిమ్మకాయలు

కోటవురట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

వేసవి ఆరంభం కావడంతో నిమ్మకాయలకు గిరాకీ పెరిగింది. వ్యాపారులు తోటల వద్దకే వచ్చి నిమ్మకాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధర అనూహ్యంగా పెరిగింది. కిలో రూ.100 నుంచి రూ.120కి కొనుగోలు చేస్తున్నారు. దీంతో నిమ్మతోటలు సాగు చేస్తున్న రైతులకు కాసుల పంట పండుతోంది. కోటవురట్ల మండలంలో కైలాసపట్నం, లింగాపురం, విశ్వనాథపురం, టి.జగ్గంపేట, తిమ్మాపురం, కోటవురట్ల, అల్లుమియాపాలెం, చినబొడ్డేపల్లి గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో నిమ్మ తోటలు వున్నాయి. వాస్తవంగా ఐదారేళ్ల క్రితం వరకు ఈ గ్రామాల్లో ఇంచుమించుగా 500 ఎకరాల్లో నిమ్మ తోటలు వుండేవి. మార్కెట్‌లో ధరలు స్థిరంగా లేకపోవడం, కొన్నిసార్లు కోత ఖర్చులు కూడా రానంతగా ధర పడిపోవడంతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో నిమ్మ తోటలు నరికివేసి, వేరే పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా వుండడంతో రానురాను నిమ్మ సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. దీంతో మార్కెట్ అవసరాలకు సరిపడ దిగుబడి లేకుండా పోయింది. ప్రస్తుతం ఊరగాయల సీజన్ కావడంతోపాటు వేసవి రావడంతో నిమ్మకాయల వినియోగం పెరిగింది. నర్సీపట్నం, తుని, అనకాపల్లి నుంచి వ్యాపారులు తోటల వద్దకే వచ్చి, రైతులు చెప్పిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సాగుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ఊతం

జిల్లాకు 1,679 యూనిట్లు మంజూరు

- రూ.2.82 కోట్ల సబ్సిడీ
- ఐదు ఎకరాలకన్నా తక్కువ భూములున్న రైతులకు లబ్ధి
- రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పంటల సాగులో కూలీల ఖర్చును తగ్గించడానికి వ్యవసాయ యాంత్రీకరణను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఐదు ఎకరాలకన్నా తక్కువ భూములు ఉన్న రైతులకు సబ్సిడీపై వివిధ రకాల పరికరాలు అందించడానికి ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది జిల్లాకు 1,697 యూనిట్లు మంజూరుకాగా, రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ పరికరాలను రైతులు తమ సొంత అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు తోటి రైతులకు కూడా తగిన రుసుముతో సేవలు అందించే అవకాశం వుంది.



పవర్ టిల్లర్

గత కొంతకాలంగా ప్రభుత్వాలు, రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందిస్తున్నాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించకపోతే, గతంలో అమల్లో వున్న పథకాలను నిలిపివేసింది. అన్ని రకాల రాయితీలకు మంగళం పాడింది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లకు ముందు యంత్ర పరికరాలు అందించేందుకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవడం, వాటిని బుట్టదాఖలు చేపడం పరిపాటిగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఇందులో భాగంగా వివిధ రకాల వ్యవసాయ పనులకు వినియోగించే యంత్రాలను రాయితీపై



మందు పిచికారీ చేసే బ్యాటరీ స్ప్రేయర్

రైతులకు అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. రైతులకు యంత్ర పరికరాల పంపిణీ బాధ్యతను ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించింది. యంత్ర పరికరం ధర ఎంత? దానిపై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఎంత? రైతు చెల్లించాల్సిన సొమ్ము ఎంత? అన్న వివరాలను స్పష్టంగా పేర్కొన్నది.

జిల్లాకు 1,679 యూనిట్లు మంజూరు

వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి జిల్లా 1,679 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో మందు పిచికారీ యంత్రాలు (బ్యాటరీ లేదా మాన్యువల్) 600 యూనిట్లు, మోటారు స్ప్రేయర్లు 300 యూనిట్లు, ట్రాక్టర్ డ్రమ్ ఆధారిత పరికరాలు 690 యూనిట్లు, రొటోవేటర్లు 24, పవర్ వీడర్లు 15, బ్రష్ కట్టర్లు 10, పవర్ టిల్లర్లు 40 యూనిట్లు. వీటికి సంబంధించి రైతులకు రూ.2.82 కోట్లు సబ్సిడీ ఇవ్వనున్నది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయి. గత వైసీపీ ప్రభుత్వం క్లస్టర్ హైరింగ్ కేంద్రాల ద్వారా రైతు సంఘాలకు పరికరాలను అరకొరగా అందించింది. అప్పట్లో రైతులు ముందుగా పరికరాల మొత్తం సొమ్ము చెల్లించేవారు. తరువాత ఎప్పటికో డీబీటీ విధానంలో రైతు సంఘాల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ సొమ్ము జమ అయ్యేది. కూటమి ... మిగతా 8వ పేజీలో



వరి పైరు, పశువుల మేత కోయడానికి వాడే బ్రష్ కట్టర్



కలుపు తీసే యంత్రం

ఫీజు బకాయిల పాపం ఎవరిది?

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ సక్రమంగా చెల్లించని వైనం

- అనేక ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలేజీ యాజమాన్యాలకు హామీ
- 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరిలో ఫీజులు విడుదల చేసిన ప్రభుత్వం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 'యువత పోరు' పేరుతో బుధవారం వైసీపీ ఆందోళన చేపడుతుండడంపై విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోని వైసీపీ నాయకులు.. ఇప్పుడు రాజకీయ ప్రయోజనం కోసం పోరుకు దిగుతుండడాన్ని వారంతా తప్పుబడుతున్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు విద్యార్థులకు ఒక్కసారి కూడా సకాలంలో ఫీజులు చెల్లించని వైసీపీ.. ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ఫీజులు చెల్లించాలని నిలదీయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.



వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల పేర్లను మార్చేసింది. అలాగే కాలేజీలకు నేరుగా ఫీజు చెల్లించే విధానాన్ని పక్కనపెట్టి విద్యార్థుల తల్లి అకౌంట్‌లో జమ చేసే విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ నిర్ణయమే విద్యార్థుల పాలిట శాపంగా మారింది. అప్పటివరకూ కాలేజీలకు ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తూ వస్తుండడంతో ఒకవేళ జాప్యం జరిగినా విద్యార్థులను యాజమాన్యాలు ఏమీ అనలేని పరిస్థితి ఉండేది. అయితే, వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నూతన విధానంతో కాలేజీలకు, ప్రభుత్వానికి మధ్య ఆర్థికపరమైన అంశాల్లో సంబంధం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం ఆయా క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజులను జమ చేసినా, చేయకపోయినా కాలేజీ యాజమాన్యాలు మాత్రం విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ వచ్చేవి. వైసీపీ ప్రభుత్వం ఒక్క ఏడాది మినహా మిగిలిన నాలుగేళ్లూ కనీసం రెండు క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజు చెల్లింపును మరుసటి విద్యా సంవత్సరానికి వాయిదా వేసుకుంటూ వచ్చింది. దీనివల్ల వేలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లించాల్సి వచ్చింది.

భారీగా బకాయిలు..

వైసీపీ ప్రభుత్వం ... మిగతా 8వ పేజీలో

బాబోయ్ దోమలు!

చీకటిపడితే స్వైరవిహారం, జనం ఇక్కట్లు

- అనకాపల్లిలో అధ్వానంగా డ్రైనేజీలు
- పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం
- వారానికోసారి కూడా శుభ్రం చేయని వైనం
- దోమల నిలయాలుగా మారిన డ్రైనేజీలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



లక్ష్మీనారాయణనగర్‌లో మురుగునీరు నిలిచిపోయి రోడ్డుపై ఏర్పడిన పాచి

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో మురుగు నీటి కాలువల నిర్వహణ అత్యంతం దారుణంగా వుంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోతున్నది. కొన్నిచోట్ల కనీసం నెలకు ఒకసారి కూడా కాలువల్లో పూడిక తీయడంలేదు. దీంతో దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. చీకటిపడితే చాలు ప్రజలపై స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలో ప్రధాన రహదారుల నుంచి చిన్నపాటి వీధుల వరకు, ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అన్న తేడా లేకుండా అన్నిచోట్లా ఇదే పరిస్థితి నెలకొంది.



రింగురోడ్డులో చెత్తతో నిండిన డ్రైనేజీ కాలువ

మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలోని అనకాపల్లి పట్టణంలో సుమారు లక్ష మందికిపైగా జనం నివసిస్తున్నారు. పట్టణంలో 23 వేలకుపైగా నివాస గృహాలు వున్నాయి. దాదాపు 20 మురికివాడలు ఉన్నాయి. భౌగోళికంగా ఎత్తుపల్లాలు అధికంగా లేకపోవడంతో వర్షపునీటితోపాటు మురుగునీటి ప్రవాహం మందకొడిగా వుంటుంది. ఇదే పట్టణవాసులకు శాపంగా మారింది. దీనికితోడు జీవీఎంసీ ... మిగతా 8వ పేజీలో

నూకాంబిక జాతర ముఖ్య ఉత్సవ అధికారిగా శోభారాణి

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):



శోభారాణి

స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ముఖ్య ఉత్సవ అధికారిగా కె.శోభారాణిని నియమిస్తూ దేవదాయ శాఖ అదనపు కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 27వ తేదీ వరకు అమ్మవారి జాతర జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈమెను నియమించింది. శోభారాణి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ హోదాలో విశాఖలోని కనకమహాలక్ష్మి ఆలయ ఈవోగా వ్యవహరిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.10
సహరి (గురు)	4.52

తాండవ గేట్లకు మరమ్మతులు

- ఈ నెలాఖరునాటికి పనులు పూర్తవుతాయని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ వెల్లడి

నాతవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఏకైన మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన తాండవ రిజర్వాయర్ మెయిన్ గేట్ల లీకేజీ నివారణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రధాన కాలువ గేట్ల మరమ్మతు పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో ప్రభుత్వం రూ.11.4 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. గేట్ల మరమ్మతు పనులకు ధవళేశ్వరం నుంచి నిపుణులను రప్పించామని, పనులు ఈ నెలాఖరుకు పూర్తవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా తాండవ మెయిన్‌గేట్లకు మరమ్మతులు చేయించలేదని, దీంతో రిజర్వాయర్ నుంచి నీరు వృథాగా పోయేదన్నారు. కాగా ప్రాజెక్టు పరిధిలో అత్యవసర పనులకు రూ.2 కోట్లు మంజూరు కాగా. ఇప్పటికే ఎడమ కాలువలో పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ డీఈఈ అనురాధ, టీడీపీ నాయకులు నందిపల్లి వెంకటరమణ, శివలంక మరిడేశ్వరరావు, కాశపు నూకరాజు, అపన విజయ్, కూనిశెట్టి దివాణం, గంటా శ్రీనివాసరావు, బొడ్డు ప్రవీణ్‌కుమార్, కశింకోట గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.




తాండవ ప్రధాన కాలువ గేట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సత్యనారాయణ, డీఈఈ అనురాధ

క్వారీల్లో విజిలెన్స్ తనిఖీలు

- ఒక ఎక్స్‌కవేటర్, 5 లారీలు సీజ్

అనకాపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):



ఊడేరులో ఒక అనధికార క్వారీలో ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

గనుల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ ఏడీ అశోక్‌కుమార్ నేతృత్వంలో రాయి క్వారీల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం అనకాపల్లి మండలం ఊడేరులో గంగరాజుకు చెందిన అనధికార క్వారీలో ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. వేటజంగాలపాలెంలో వే బిల్లులు, అనుమతులు లేకుండా రోడ్డు మెటల్ రవాణా చేస్తున్న ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటికి ఎంతెంత అపరాధ రుసుము విధించారో వెల్లడించాల్సి వుంది.

మే 5 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు



సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

ఎలమంచిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో మే 5వ తేదీ నుంచి మూడు రోజులుపాటు నిర్వహించే సీపీఐ రెండో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు. మంగళవారం సీపీఐ నేతలతో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఈ మహాసభల్లో సామాజిక, రాజకీయ అంశాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ మహాసభల్లో 200 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన్నదొరబాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సన్యాసిరావు, రామనాయుడు, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యువత పోరు హాస్యాస్పదం

▸▸ టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగవెంకటరమణ

పాయకరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం వైఎస్.జగన్ హయాంలో పెట్టిన ఫీజు బకాయిలపై వైసీపీ బుధవారం యువతపోరు చేపడుతుండడం హాస్యాస్పదంగా ఉందని తెలుగునాడు విద్యార్థి సమాఖ(టీఎన్ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పెదిరెడ్డి నాగవెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ఇవ్వకుండా విద్యార్థులను ఎంతగానో మాజీ సీఎం జగన్ వేధించారని, పీజీ విద్యార్థులకు అసలు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకుండా చేశారన్నారు. ఇదేమి అన్యాయమని అడిగిన వారిపై లాఠీచార్జీ చేయించాడని ఆరోపించారు. అటువంటి ఆయనకు ఇపుడు యువత, విద్యార్థులు గుర్తొస్తున్నారా? అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూటమి ప్రభుత్వం తీరుస్తుండడం వలనే చాలామంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందుతున్నాయన్న విషయం వైసీపీ నాయకులు తెలుసుకోవాలని ఆయన తెలిపారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లుల ఆదా

▸▸ డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ

మునగపాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో బిల్లులు భారం కూడా అదే స్థాయికి చేరుకుందని డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ అన్నారు. మండలంలో తిమ్మరాజుపేటలో గ్రామ సంఘం సభ్యులతో మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం అందుబాటులోకి వచ్చిందని, సబ్సిడీతో కూడిన ఈ పథకం ద్వారా విద్యుత్ బిల్లులు భారం తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ చెల్లింపులు, పుస్తకాల పరిశీలన, ఆర్థిక లావాదేవీలను పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఫైనాన్స్) శ్రీనివాస్, కుమారస్వామి (బ్యాంక్ లింకేజ్), వెలుగు ఏపీఎం బాలరాజు, సీసీ రామకృష్ణ, విలేజ్ అసిస్టెంట్ శ్రావణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగలు



దిబ్బపాలెం నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బపాలెంలో నూకాలమ్మ, లంక ధర్మవరంలో పైడితల్లమ్మ పండగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికంగా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కుబడులు చెల్లించారు. రాత్రి వివిధ సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

నిబంధనలు పాటించని వాహనచోదకులపై చర్యలు

▸▸ వాహన తనిఖీ అధికారి కాశీవిశ్వనాథ్



వాహనాలను తనిఖీ చేస్తున్న కాశీవిశ్వనాథ్

అచ్యుతాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని వాహన చోదకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి వాహన తనిఖీ అధికారి కాశీవిశ్వనాథ్ అన్నారు. మంగళవారం అచ్యుతాపురం జంక్షన్‌లో ఆయన వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేసి 20 కేసులు నమోదు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రికార్డులు సరిగా లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇకపై తరచూ తనిఖీలు జరుపుతామన్నారు.

మంత్రి కొండపల్లిని కలిసిన ప్రగడ



మంత్రి శ్రీనివాస్‌ని కలిసిన ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని ఆయన కార్యాలయంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురం సెజ్‌లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటుతోపాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించడానికి చొరవ చూపాలని కోరారు. అలాగే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్రంగా నష్టపోయిన యువ పారిశ్రామికవేత్తలను ఆదుకోవాలని కోరారు. దుప్పితూరు మహలక్ష్మి, ఏకోసిటీ కుటీర పరిశ్రమను ఆదుకోవాలని కోరారు.



ఎదురు సన్నాహకాన్ని ప్రారంభిస్తున్న ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు



ఇత్తడి శేష తల్పంపై శ్రీదేవి, భూదేవి అమ్మవారి ఉత్సవమూర్తులు

సందడిగా ఎదురు సన్నాహక మహోత్సవం

నక్కపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆనాడు శ్రీనివాసుడి కల్యాణం ఎలా జరిగిందో కలియుగంలో చూసిన వారెవరూ లేరు.. కానీ పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం అలనాడు శ్రీవారి కల్యాణం ఎలా జరిగిందో ఉపమాక క్షేత్రంలో కళ్లకు కట్టినట్టు ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ గాయత్రీదేవి వివరించారు. సోమవారం రాత్రి ఎదురుసన్నాహ మహోత్సవంలో భాగంగా ఉపమాక మాఢ వీధుల్లోని సింహాద్రాచార్యులు ఇంటి వద్ద ఈ ఘట్టాన్ని ఆమె అద్భుతంగా వివరించారు. స్వామివారు, అమ్మవారి పెండ్లి చూపులు, పెండ్లిమాటలు ఎలా జరుగుతాయో వినేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మాఢవీధులు కిక్కిరిసిపోయాయి. హోం మంత్రి అనిత సహా అనేకమంది అధికారులు, పెద్దలు, భక్తులు ఎదురు సన్నాహ మహోత్సవాన్ని తిలకించి ఆనందపరవశులయ్యారు. స్వామివారికి డాక్టర్ గాయత్రీదేవి అనేక దశాబ్దాల నుంచి చేస్తున్న సేవను హోం మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనితను గాయత్రీదేవి,ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు సత్కరించారు.



స్వామివారి, అమ్మవారి పెండ్లిమాటలను వినిపిస్తున్న డాక్టర్ గాయత్రీదేవి

ఎలమంచిలి పట్టణ వాసులకు ట్రాఫిక్ తిప్పలు

▸▸ ఇరుకుగా ఉన్న మునిసిపల్ రోడ్లు

▸▸ ఆపై వాహనాల పార్కింగ్

▸▸ దిమిలి, సైతారుపేట జంక్షన్ల వద్ద పాట్లు

▸▸ పోలీస్, మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

ఎలమంచిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారుల విస్తరణ లేకపోవడంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్లు విస్తరించకపోవడంతో నిత్యం ట్రాఫిక్ తిప్పలు పడుతున్నారు. వారపు సంత జరిగే గురువారం, ఆదివారమైతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ప్రధాన వ్యాపారులతోపాటు కొందరు చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి తమ వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. దిమిలి రోడ్డు, సైతారుపేట రోడ్డు జంక్షన్ల వద్ద ఉన్న రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. అంతేకాకుండా ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు రోడ్లపైనే తమ వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. దీంతో రోడ్డు పొడవునా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా దిమిలి రోడ్డు, సైతారుపేట రోడ్డు జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వీటికి తోడు సాయంత్రమైతే కుర్రకారు బైక్ రేస్‌లతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తున్నది. పట్టణంలో ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు అధికారిక స్థలాలు కేటాయించకపోవడంతో ద్విచక్రవాహనదారులను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియక రోడ్డుపైనే చేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేలా అటు పోలీస్, మునిసిపల్ అధికారుల సమన్వయంతో ముందుకు వచ్చి అధికారిక పార్కింగ్ స్థలాలు కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణ ప్రధాన రోడ్డుపై నిలిచిపోతున్న వాహనాలు

రాంబిల్లిలో ప్రతీ మంగళవారం ట్రాఫిక్ జామే..

▸▸ రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు

▸▸ రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

రాంబిల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం వారపు సంత నాడు ట్రాఫిక్ జామ్ అవుతున్నది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ మంగళవారం మండల పరిషత్ కార్యాయం ఆవరణలో వారపు సంత జరుగుతుంది. ఈ సంతకు 30 గ్రామాలకు చెందిన వారు వస్తుంటారు. రోడ్డును ఆనుకొని దుకాణాలు పెట్టడంతో సంతకు వచ్చిన జనంతో నిండిపోతున్నది. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతున్నది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్నప్పటికీ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మంగళవారం సంత రోజు ట్రాఫిక్‌జామ్ లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రాంబిల్లి జంక్షన్‌లో రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తుండడంతో నిలిచిన వాహనాలు

బుద్ధిమాంద్యం విద్యార్థులకు బోధనలో మార్పులు తేవాలి

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా బుద్ధి మాంద్యం గల విద్యార్థులకు బోధనలో మార్పులు తీసుకురావాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ బుద్ధి మాంద్యం గల పిల్లలకు విద్య నేర్పేందుకు ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేకంగా పోస్టులు కేటాయించాలని కోరారు. ఈ నియామకాల ద్వారా ఆయా కుటుంబాల మీద ఆర్థిక భారం తగ్గించడంతోపాటు మానసిక ఒత్తిడి నుంచి తల్లిదండ్రులను బయటపడతారన్నారు. విద్యా మంత్రి లోకేశ్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న విజయకుమార్

సీతపాలెంలో మడ అడవుల పెంపకం

▸▸ నేడు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

రాంబిల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరు పంచాయతీ శివారు సీతపాలెం సముద్రతీరంలో మడ అడవుల పెంపకానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్క ప్రాజెక్టు వారి సౌజన్యంతో, ఉపాధి హామీ పథకం కింద మడ అడవుల పెంపకానికి బుధవారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. సుమారు రెండు ఎకరాల్లో 1,000 మొక్కలు నాటనున్నట్టు ఉపాధి పథకం ఏపీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, తదితరులు హాజరవుతారని చెప్పారు. కాగా మడ అడవులను అభివృద్ధి చేసే ప్రదేశాన్ని మంగళవారం డ్వామా పీడీ ఆర్.పూర్ణిమ, ఎంపీడీవో జయమాధవి, ఉపాధి పథకం క్లస్టర్ ఏపీడీ యరకయ్య పరిశీలించారు.



సీతపాలెం సముద్రతీరంలో మడ అడవుల పెంపకం జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమ, ఎంపీడీవో జయమాధవి

జోరుగా పుచ్చకాయల విక్రయాలు



రాంబిల్లిలో అమ్మకానికి సిద్ధం చేసిన పుచ్చకాయలు

రాంబిల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవి దాహార్తిని తీర్చే పుచ్చకాయలు విక్రయాలు జోరందుకున్నాయి. ఎండలు మండిపోతుండడంతో వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలను తినేందుకు అందరూ ఎగబడుతున్నారు. మండలంలోని వెంకటాపురం నుంచి ఎలమంచిలి వెళ్లే ప్రధాన రహదారిలోను, రాంబిల్లిలోను పలుచోట్ల వ్యాపారులు పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. పుచ్చకాయలు కాయను బట్టి రూ.30 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు ముక్క రూ.5 విక్రయిస్తున్నారు. వేసవి తాపాన్ని తీర్చడంలో పుచ్చకాయ ఎంతో బాగా పని చేస్తుందని రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. పుచ్చకాయలో నీరు, లవణాలు, విటమిన్‌లు, కేలరీలు, పోటాషియం, పీచు వంటి పదార్థాలు పుష్కలంగా ఉంటాయన్నారు.

మహిళలు శిక్షణను వినియోగించుకోవాలి

▸▸ మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మెప్మా ప్రతినిధి పద్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ఈ శిక్షణలో వ్యాపార మెలకువలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు అచ్యుతరావు, అమూల్య, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి ప్రసన్నకుమార్, మెప్మా సీఓలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



మెప్మా కార్యాలయంలో స్వయం సహాయక సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరాజు

సూర్యశక్తి వికాస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ ఏపీజీవీబీ హబ్ క్రెడిట్ ఆఫీసర్ మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ అధికారులు

పాయకరావుపేట రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాలపై సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా ఏపీజీవీబీ అందిస్తున్న సూర్య శక్తి వికాస్‌ను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు పాయకరావుపేట హబ్ క్రెడిట్ ఆఫీసర్ ఆర్. మోహనరావు అన్నారు. మండలంలోని మాసాహెబ్‌పేటలో మంగళవారం ఆయన ఏపీజీవీబీ సత్యవరం బ్రాంచి మేనేజర్ సీహెచ్.రాజీవ్, ఫీల్డ్ ఆఫీసర్ ఐ. సురేంద్రతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్య శక్తి వికాస్‌లో సబ్సిడీపై రుణాలను అందిస్తున్నట్టు తెలిపారు. త్రీ కిలో వాట్స్ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు రూ.2.1 లక్షలు వ్యయం అవుతుందన్నారు. పదేళ్ల కాల పరిమితితో బ్యాంకు రుణంగా అందిస్తుందన్నారు. దీనిలో లబ్ధిదారుడు పది శాతం కంట్రిబ్యూషన్ చెల్లించాలని, మిగతాది బ్యాంకు రుణంగా అందిస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. ఏడు శాతం వడ్డీపై రుణం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం పొందాలంటే ఆధార్ కార్డు, పాన్ కార్డు, కరెంటు బిల్లు, ఇంటి పన్ను రశీదు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంతం దివాణం, గెడ్డమూరి శ్రీనివాసరావు, గెడ్డమూరి నాగార్జున పాల్గొన్నారు.

'రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి'



పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏవో ఆదినారాయణ అన్నారు. మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి అవగాహన కల్పించారు. గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ఎన్‌పీఎస్ఎస్ యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది కె.వీరబాబు, జి.గోపీకృష్ణ, పి.జోగారావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రి భవనం ప్రారంభమెన్నడో?



పెదకవలాపల్లిలో నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనం

రాంబిల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకలవలాపల్లిలో పశువుల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించాలని పెదకవలాపల్లి, చినకలవలాపల్లి, వైలోవ గ్రామాల పాడిరైతులు కోరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.18 లక్షలతో నిర్మించిన ఈ ఆస్పత్రిని సంవత్సరాలు తరబడి ప్రారంభించకుండా వదిలేశారని వారు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పశువుల ఆసుపత్రిని నిర్వహిస్తున్నారని నూతనంగా నిర్మించిన ఆస్పత్రిలోకి మార్చాలని వారు కోరుతున్నారు.

అన్న క్యాంటీన్ షెడ్డు ప్రారంభం



దాత ధనరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఎలమంచిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేదలకు ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌కు రూ. మూడు లక్షలతో నిర్మించిన షెడ్‌ను దాత కర్రి ధనరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అన్న క్యాంటీన్ వద్ద భోజనానికి వచ్చే వారంత ఎండలో ఉంటున్న విషయాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. అప్పటికే షెడ్డు నిర్మించేందుకు ముందుకు వచ్చిన పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కర్రి ధనరెడ్డి వెనువెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయించారు. ఈ షెడ్డును మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు పరిశీలించి, దాత ధనరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ధనరెడ్డిని టీడీపీ నేతలు ఆడారి ఆదిమూర్తి, బి. చిన్నారావు, సాగర్ హుస్సేన్, అన్న క్యాంటీన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఘనంగా పొలిపల్లెమ్మ పండగ



పొలిపల్లెమ్మను దర్శించుకున్న భక్తులు

మునగపాక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో మంగళవారం పోలిపల్లెమ్మ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ అలంకరణ, పూలతోరణాలు ఏర్పాటు చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బుద్ధ రవిశంకర్ అచ్చినాయుడు పర్యవేక్షణలో పండగ నిర్వహించారు.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి: ఎంపీడీవో

నక్కపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్నందున తాగునీరందించే ట్యాంకులను శుభ్రం చేయాలని ఎంపీడీవో డి. సీతారామరాజు ఆదేశించారు. మంగళవారం మండలంలోని కాగిత గ్రామంలో రక్షిత నీటి ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను శుభ్రపర్చి, క్లీనింగ్ డేట్‌లను నమోదు చేయాలని పంచాయతీ సెక్రటరీ, సిబ్బందికి సూచించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు

» ఆర్డీవో రమణ స్పష్టీకరణ » జంగాలపల్లిలో ఇసుక ర్యాంపు తనిఖీ » ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపట్టిన ప్రదేశం పరిశీలన

మాకవరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ మాకవరపాలెం తహసీల్దార్ రామారావును ఆదేశించారు. మండలంలోని జంగాలపల్లి గ్రామంలో గల ఇసుక ర్యాంపును మంగళవారం ఆయన తనిఖీ చేసి ఇసుక నిల్వలు, తదితరాలపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రదేశాలను పరిశీలించారు. సర్పా నదికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కొందరు రైతులు ఆక్రమించి, ఆ భూముల్లో ఉన్న ఇసుకను తవ్వి అమ్మకాలు జరిపిన విషయాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సదరు భూములను పరిశీలించారు. భూములను ఆక్రమించడమే కాకుండా అందులో ఇసుకను ఎలా తవ్వుతారని అక్కడున్న రైతులను ప్రశ్నించారు. దీనికి తోడు నదిగట్టు కూడా ఇసుక అక్రమార్కులు తవ్వడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ భూముల్లో ఇసుక తవ్వకాలు జరపరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐలు, వీఆర్వోలు ఉన్నారు.



జంగాలపల్లిలో ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

వడ్డాది వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది వేంకటేశ్వరస్వామిని మంగళవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు దొండా శ్రీరామ్, ఈవో టీఎస్.శర్మలు ఎమ్మెల్యేకి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి ఘనంగా సత్కరించారు. అర్చకులు ఆశీర్వచనాలు పలికి స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం, బీఎన్.రోడ్డు నిర్మాణం గురించి వేంకటేశ్వరస్వామిని వేడుకున్నానని అన్నారు. ఆయన వెంట విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ నాగేశ్వరిదేవి, కూటమి నేతలు దొండా సన్యాసిరావు, దొండా నరేష్, వియ్యపు అప్పారావు, జి.కోటేశ్వరరావు ఉన్నారు.

పోలవరంలో తలుపులమ్మ పండగ

గొలుగొండ మార్చి, (ఆంధ్రజ్యోతి) 11 : మండలంలోని పోలవరంలో మంగళవారం తలుపులమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. చీడిగుమ్మల పంచాయతీ శివారున ఉన్న ఈ గ్రామంలో కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రికిలు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు అర్జున, అప్పలనాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

140 మంది టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



విద్యార్థినికి పరీక్ష కిట్ అందిస్తున్న సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు

కృష్ణాదేవిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, ఇతర పరీక్ష సామగ్రిని స్థానిక అల్లూరి సీతారామరాజు వర్తక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగభూషణం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్తక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సంఘం నాయకులు లాలం నానిబాబు, ఎస్.జోగిబాబు, జోగునాథం, రామకృష్ణ, చక్రి, లక్ష్మి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ రాజులునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మాకవరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చామంతిపురంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేశామని తహసీల్దార్ లోకవరపు రామరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో చామంతిపురంలో సర్వే నంబరు 464 పోరంబోకు భూమిలో ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు



ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ రుణాలకు మంగళవారం నుంచి మండలంలో ఓబీఎంఎంఎస్ పోర్టల్ లేదా సచివాలయాల ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు స్వీకరించలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు కుట్టు మిషన్లు, శిక్షణకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

మాడుగుల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల కేంద్రంలోని విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మాడుగుల భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ యడ్ల కళావతి, శ్రీనాద శ్రీనివాసరావు, దంగేటి సూర్యారావు, పుప్పాల అప్పలరాజు. పుట్టా గంగయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో విశాఖపట్నం ఇండస్, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి వ్యాధులతో బాధపడుతున్న 60మంది రోగులను గుర్తించి ఆపరేషన్ నిమిత్తం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.గంగరాజు, నర్సింహరెడ్డి, సౌజన్య, రాహుల్, భవానీ, దేదీప్య, భారత నిర్మాణ సేవ ట్రస్ట్ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇద్దరు కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

రావికమతం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం దొండపూడి గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా గ్రామ సచివాలయం వెనుక ఖాళీ స్థలంలో కోడి పందేలు జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేసి పందేలు నిర్వహిస్తున్న ఇద్దర్ని అరెస్టు చేశారు.

త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలి : ఆర్‌డీవో

బుచ్చెయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి తహసీల్దార్ కార్యాలయాన్ని అనకాపల్లి ఆర్‌డీవో షేక్ అయిషా మంగళవారం సందర్శించారు. రెవెన్యూ రీసర్వేలో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని ఆన్‌లైన్ చేశారు... ఎన్నింటిని పరిష్కరించారని ఆరా తీశారు. కొత్తగా పెట్టుకున్న ముటేషన్‌లు త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్‌ని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి, పూర్తికాని అర్జీలపై ఆరాతీశారు. వాటి వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఉపాధి కూలీలు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నాలుగు వారాలుగా బిల్లులు చెల్లించకపోతే గడ్డి తిని బతకాలా? అంటూ నోట్లో గడ్డి పెట్టుకొని నిరసన తెలియజేశారు. గర్శింగి పంచాయతీ డొర్ర చెరువు, తెనుగుపూడి, మారేపల్లి గ్రామాల్లో కూలీలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెం కాలువల్లో కదలని మురుగు



గొలుగొండ మార్చి, (ఆంధ్రజ్యోతి) 11 : పప్పుశెట్టిపాలెంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు తిష్ఠ వేస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు విజృంభించి రాత్రివేళ కంటిపై కునుకు ఉండడం లేదని పలువురు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో కాలువల్లో మురుగు పారే మార్గం లేక రోడ్డుపైకి చేరుతోందని అంటున్నారు.

ముగిసిన రసాయన శాస్త్ర సదస్సు

చోడవరం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. రెండవ రోజు సదస్సులో ఐఐటీ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, నానో పార్టికల్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భువనేశ్వర్ ఐఐటీ ప్రొఫెసర్ కె. విజయకృష్ణ గ్లోబల్ వార్మింగ్, కర్బన పదార్థాల గురించి వివరించారు. ఈ సదస్సులో భువనేశ్వర్, బర్హంపూర్, ఎస్‌ఆర్‌ఎం, గీతం, విజ్ఞాన్ యూనివర్శిటీలు, ఐఐటీలకు చెందిన కెమిస్ట్రీ ప్రొఫెసర్లు పార్థసారథి, ప్రభాకర్, ఆదినారాయణ, తదితరులు మాట్లాడారు. ఈ సదస్సుకు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన లెక్చరర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, రసాయన విభాగం హెచ్‌వోడీ లక్ష్మీ మంగమ్మ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెన్నవోలులో అగ్ని ప్రమాదం

చోడవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో మజ్జి శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన పశువుల పాక కాలిపోయింది. ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పాక పూర్తిగా కాలిపోయింది. పశువులను బయట కట్టేయడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాయి. పేద కుటుంబానికి చెందిన శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు మజ్జి గౌరీశంకరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో గావు సంబరాలు

కె.కోటపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించే గంగాదేవి గావు పండగలు మండలంలోని కింతాడ శివారు జోగన్నపాలెం, గుల్లేపల్లిల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి ఏర్పాటు చేసిన పెద్ద పందిళ్లలో వస్త్రాలు, అరటిగెలలు, కొబ్బరి బొండాలు, వివిధ రకాల పండ్లు, కరెన్సీ నోట్లు వేలాడదీస్తారు. కొందరు మేకలు మొక్కుకుంటూ అమ్మవారికి సమర్పిస్తుంటారు. కార్యక్రమాన్ని జోగన్నపాలెం సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు, గుల్లేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దేముడుబాబు, కె.గంగరాజు, రామునాయుడు నిర్వహించారు.

14న దేవిపెద్దింటమ్మ జాతర

రోలుగుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసర్లపూడిలో ఈనెల 14న శ్రీదేవి పెద్దింటమ్మ జాతర నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈనెల పదో తేదీన ప్రారంభమైన ఉత్సవాలు 14వ తేదీన ముగుస్తాయి. ఆరోజు రాత్రి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీసీల ఎదుగుదలే టీడీపీ లక్ష్యం

» బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నూకరాజు

బుచ్చెయ్యపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఇద్దరు బీసీలను ఎంపిక చేసి, బీసీల పార్టీగా మరోసారి రుజువైందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నూకరాజు అన్నారు. మంగళవారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి ఎన్‌టీఆర్ ఎనలేని కృషిచేశారన్నారు.జగన్ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా, ఆర్థికంగా అణచివేశారని ఆరోపించారు. బీసీలపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు, వేధింపులే అజెండాగా వైసీపీ ప్రభుత్వం పాలించిందన్నారు.

'పెద్దేరు, తారకరామ'లకు మరమ్మతులు చేయండి

» మంత్రికి టీడీపీ నేతలు వినతి



ఇరిగేషన్ అధికారిని కలిసి వినతిపత్రాన్ని అందించిన ఎమ్మెల్యే బండారు, మాడుగుల టీడీపీ నాయకులు

మాడుగుల, మాడుగుల రూరల్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు, తారకరామ రిజర్వాయర్ల మరమ్మతులు, లైనింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం ఇరిగేషన్ ఉన్నతాధికారి వెంకటేశ్వరరావుని కలిశారరీ రెండు జలాశయాల మరమ్మతులు చేస్తే వేలాది ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా మాడుగులలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యా శాఖాధికారులను కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వద్దే రాజ్‌కుమార్, మాడుగుల మండల క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

కెమిస్ట్రీ అంటే భయపడొద్దు : లెక్చరర్ రమేశ్

చోడవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కెమిస్ట్రీ సబ్జెక్ట్ మిస్టరీగా భావించకుండా ఆసక్తితో చదివితే చక్కని ఫలితాలు సాధించడానికి అవకాశం ఉందని విశాఖ బీఎస్ కృష్ణా కాలేజీ కెమిస్ట్రీ లెక్చరర్ ఏవీ.రమేశ్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని గౌరీపట్నం జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులకు కెమిస్ట్రీ సబ్జెక్ట్‌పై క్లాసులు తీసుకున్నారు. అనంతరం సులభతరంగా రసాయన ప్రయోగాలు చేసి చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.లక్ష్మి, ఉపాధ్యాయుడు వేగి సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ



మట్టవానిపాలెంలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

రావికమతం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టవానిపాలెంలో పరదేశమ్మ పండగను ఆ గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు వాణి శర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాల వెంకటలక్ష్మీదేవి, గుమ్మాల శంకర్, ఎంపీటీసీ సభ్యుడు కరణం అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆర్. అప్పలనర్సమ్మ, కన్నంనాయుడు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అట్టలు పంపిణీ

దేవరాపల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను మంగళవారం అట్టలు, పరీక్షా సామగ్రి అందజేశారు. దారపురెడ్డి సన్యాసినాయుడు ఆర్థిక సాయంతో వీటిని కొనుగోలు చేశామని శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలత్రిపుర సుందరి, రంధి వెంకటరావు, కొటాన రాంబాబు పాల్గొన్నారు.

2,308 కిలోల నల్లబెల్లం, మద్యం సీసాలు ధ్వంసం

చోడవరం, మార్చి11(ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో పట్టుబడిన నల్లం బెల్లం, సారా, మద్యం బాటిళ్లను మంగళవారం స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ.నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు కేసులలో పట్టుబడిన 2,308కిలోల నల్లం బెల్లంతోపాటు, 63 లీటర్ల సారా, 390 మద్యం బాటిళ్లను మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశారు.

ఉపాధి పనులు కల్పించండి : ఏపీడీ

రావికమతం,మార్చి11 (ఆంధ్రజ్యోతి): చీమలపాడు పంచాయతీ పరిధిలో ఇంకా ఉపాధి పనులు జరగని గ్రామాలలో తక్షణమే పనులు కల్పించాలని అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ జె.మణికుమార్ ఆదేశించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన ఆ పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పంచాయతీలో 161 పనులకు గాను రూ.2.1 కోట్లు విలువైన పనులు ఉన్నాయన్నారు. ఈ పంచాయతీ పరిధిలో ఏ గ్రామంలో పనులు కావాలన్న వెంటనే మంజూరు చేయాలని ఏపీవో కాశీని ఆయన ఆదేశించారు.

20ఎకరాల్లో జీడి,మామిడి తోటల దగ్ధం

చీడికాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతవరంలో మంగళవారం పది మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో జీడి, మామిడి తోటలు దగ్ధమై రూ.పది లక్షల వరకూ నష్టం వాటిల్లింది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో కురచా అప్పలనాయుడు, కురచా ఈశ్వరరావు, కురచా సోమునాయుడు, కురచా లక్ష్మితోపాటు మరోఆరుగురు రైతుల జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారుల్లో కదలిక

» వెంకన్నపాలెం కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు

చోడవరం, మార్చి 1 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు నిలయంగా మారిన వెంకన్నపాలెం కల్వర్టు వద్ద ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. చోడవరం-విశాఖ-అనకాపల్లి రోడ్లో వెంకన్నపాలెం సమీపంలోని శిథిల కల్వర్టు వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో అనేకమంది వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కల్వర్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలంటూ సీపీఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించడంతోపాటు, ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం కూడా నిర్వహించారు. కల్వర్టు వద్ద వెంకన్నపాలెంకు చెందిన స్థానిక ఉపాధ్యాయుడు గోవింద్, కర్రలతో తాత్కాలిక రక్షణ గోడ నిర్మాణాన్ని కూడా చేపట్టారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో స్పందన రాలేదు. ఇటీవల ఈ కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదంలో చీడికాడకు చెందిన ఓ యువకుడు, అతని మూడేళ్ల కుమార్తెతో సహా గొయ్యిలో పడిపోయి తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తరువాత అన్నిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. స్థానికుడు గోవింద్ మాస్టారు ఎర్ర జెండాలు కట్టి వాహనదారులను అప్రమత్తం చేసే పనిని చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రమాదకర కల్వర్టు వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు ప్రారంభించడం గమనార్హం.



వెంకన్నపాలెం కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టిన దృశ్యం

జీడిపిక్కల బోర్డు ఏర్పాటు చేయాలని ఆందోళన

మాడుగుల రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జీడి పిక్కలకు మద్దతు కల్పించేందుకు బోర్డు ఏర్పాటు చేయాలని మండలంలోని శంకరం పంచాయతీ రాయిపాలెం గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం జీడిపంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ గిరిజనులు ఆందోళన చేశారు. అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కేజీ రూ.200లకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడిపంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్డ్ ఏరియా ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, కార్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు

» తొలగించిన వారిపై కేసులు : తహసీల్దార్

రావికమతం,మార్చి11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులను తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ బి. వెంకటరమణ రావికమతం పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. తహసీల్దార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తోటకూరపాలెం రెవెన్యూలో సర్వే నంబరు 13/3 లో ఐదెకరాల ప్రభుత్వ భూమిలో జీడిమామిడి తోట ఉందన్నారు. ఆ భూమిని పీవోటీ కింద రెవెన్యూ అధికారులు ఇటీవలే స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వాటిని మాకవరపాలెం మండలం అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన అనార రాజు, అనార రాజుబాబు, అనార దుర్గునాయుడు, అనార సత్తిబాబు తొలగించారు. ఆ నలుగురుపై కేసు నమోదు చేయాలని పోలీసులను తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు.

నీలకంఠపురంలో చోరీ

బుచ్చెయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీలకంఠపురంలో పడాల శంకర్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి రూ.20వేలు నగదు, ఐదు తులాల బంగారం అపహరించారని బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

భూ రీసర్వేను పరిశీలించిన ఆర్డీవో



సర్వే వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో

రోలుగుంట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పైలెట్ గ్రామాల్లో తప్పులు లేకుండా భూసర్వే చేపట్టాలని ఆర్డీఓ వీవీ రమణ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రాజన్నపేటలో జరుగుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. భూవివాదాలకు తావులేకుండా చూడాలన్నారు. రీ సర్వేకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ నాగమ్మ, వీఆర్వోలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

మాడుగుల రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. మంగళవారం శంకరం పంచాయతీలోని గొప్పూరు, తాడివలస గ్రామాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. చేతిబోర్లు పనిచేస్తున్నాయా? మరమ్మతులకు గురయ్యాయా? అని పరిశీలించారు. అలాగే రెండు గ్రామాలకు ఉన్న రక్షిత నీటి పథకానికి కొత్త మోటారు వేయించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఎంపీడీవో సూచించారు. అనంతరం మండలంలోని వీరనారాయణం సచివాలయాన్ని ఎంపీడీవో కొంకి అప్పారావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే జంపెనలో జరుగుతున్న ఉపాధి పనులకు పరిశీలించారు.

ఘనంగా పరదేశమ్మ అమ్మవారి పండగ



సీతయ్యపేటలో అమ్మవారి తిరువీధి ఉత్సవం

బుచ్చెయ్యపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్యపేటలో పరదేశమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా, ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాసరావు బందోబస్తు నిర్వహించారు.

బుడ్డిబందలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కవ్వగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో మంగళవారం చేరారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వారందరికీ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో పట్టాలమ్మ పండగ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే రాజు సమక్షంలో వైసీపీకి చెందిన అల్లం దేముళ్లు(పెద్దేరు కెనాల్ డైరెక్టర్), రాంసల గంగరాజు, రోబ్బా గంగయ్యమ్మ, జగన్నాథం, లోవరాజు, అల్లం ఎరకన్నదొర, మామిడి ఆనంద్, నల్లమాటి రాజిబాబు, గుళ్ల రమణ, గూళ్ల ఎర్రయ్యమ్మ టీడీపీలో చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజును గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఆర్ఎస్ వరహాలు దొర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడురాజాన కొండనాయుడు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో టీడీపీ నేతల పర్యటన



బోడి గరువు గ్రామాలకు వెళ్తున్న అప్పలనాయుడు,టీడీపీ నేతలు

దేవరాపల్లి, మార్చి 11(ఆంధ్ర జ్యోతి) మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు గ్రామాలు బోడి గరువు, తదితర గ్రామాల్లో టీడీపీ ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, టీడీపీ మండల నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చింతలపూడి నుంచి బోడిగరువు, నేరళ్లపూడి రోడ్డును నిర్మించాలని, రేషన్ బియ్యాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల.పాత్రునాయుడు, నానాజీ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాన్ని అడ్డుకుంటే సహించం

» మండల సమావేశంలో అటవీ శాఖ అధికారుల తీరుపై ఎంపీపీ రమేశ్‌బాబు ధ్వజం

కొయ్యూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరు అనుమతితో మారుమూల గ్రామాలకు చేపడుతున్న రహదారుల నిర్మాణాలను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటూ అభివృద్ధి నిరోధకులుగా మారారని, ఈ వైఖరి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడు తూ కలెక్టరు అనుమతితో మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నారు. అయితే, కొండవాగు ప్రవాహాలపై కల్వర్టులు నిర్మాణాలకు అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై చర్చించాలంటే సమావేశాలకు హాజరుకావడంలేదన్నారు. ఇలా అయితే, అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధి ఏపీవో సమావేశానికి హాజరుకాకపోవడంతో ఆయనను పిలిచి మందలించారు. ఇటీవల గ్రామాలలో ఉపాధి పాత మేట్‌లను తొలగించి, నిబంధనలకు విరుద్ధంగా కొత్త వారిని నియమించారన్నారు. వీరి నియామకాల్లో వీఆర్‌పీలు, కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇక్కడి నుంచి బదిలీపై పంపాలని లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సస్పెండ్ చేయించాల్సి వస్తుందని ఎంపీపీ ఏపీవోను హెచ్చరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతిని సమావేశం ముందుంచారు. ప్రస్తుతం మండల పరిధిలో ఉన్న నాలుగు పీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారుల్లో ఏ ఒక్కరూ సమావేశానికి హాజరు కాకపోవటంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ తమ గ్రామ పీహెచ్‌సీలో మలేరియా నియంత్రణకు అవసరమైన మందులు లేవని, ఆసుపత్రి అభివృద్ధి నిధులలో అత్యవసర మందులు కొనుగోలు చేసే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు లేవన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగ జేఈ మాట్లాడుతుండగా అభివృద్ధి పనుల శంకుస్థాపనల్లో ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా చేస్తున్నారని సభ్యులు విరుచుకుపడ్డారు. ఎంపీపీ సర్దిచెప్పారు. గృహ నిర్మాణ శాఖ పనితీరుపై సభ్యులు ప్రశంసల వర్షం కురిపించారు.


ఉపాధి ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ రమేశ్‌బాబు

అంతంతంత మాత్రంగా ప్రజాప్రతినిధుల హాజరు

సమావేశానికి అధికారులు హాజరు పూర్తి స్థాయిలో వచ్చినా, ప్రజా ప్రతినిధులు మా త్రం అతితక్కువ హాజరయ్యారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజుతోపాటు ఇద్దరు వైస్ ఎంపీపీలు డుమ్మా కొట్టారు. 14 మంది ఎంపీటీసీలలో ఇద్దరు (బాలారం, శరభన్నపాలెం) ఎంపీటీసీలు చనిపోగా మిగిలిన 12 మందిలో కేవలం ఎంపీపీతో పాటు డౌనూరు, బంగారమ్మపేట, యు. చీడిపాలెం, ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. అలాగే 33 పంచాయతీలకు గానూ 10 మంది సర్పంచులు మా త్రమే హాజరయ్యారు.

చింతపల్లిలో డాక్టర్ పోస్టుల భర్తీకి హెల్త్ డైరెక్టర్‌కు లేఖ

» ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలు భర్తీకి సెకండరీ హెల్త్ డైరెక్టర్‌కి లేఖ రాసినట్టు పాడేరు ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిల్లో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియా, ఇతర వైద్యనిపుణుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో మెరుగైన వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు రోగులకు తరలించాల్సివస్తుందన్నారు. ఈ నేపథ్యంలో తాను లేఖ రాయడంతో సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఖాళీగా ఉన్న వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వైద్యులు అన్నివేళలా రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేదన్నారు. వసతి గృహాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకునేలా వైద్యులు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. వార్డులు, ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనతరం బెడ్‌షీట్స్ కొనుగోలు, ఆస్పత్రిమరమ్మతులు, రోగులకు సదుపాయాలు కల్పనకు నిధులు ఖర్చుపై తీర్మానం చేశారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక, ఎంపీపీ కోరాబు అనుషదేవి, సభ్యులు, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డి. మహేశ్వరరావు, జల్లి హలియారాణి, సాగిన దేవుడమ్మ, ఈశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి గిరిజన ప్రాంత సమస్యలు

పాడేరురూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జాతీయ షెడ్యూల్ తెగల (ఎస్టీ) కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యను ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి ఆంధ్ర ప్రదేశ్‌లోని గిరిజన ప్రాంత సమస్యలను వివరించినట్టు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎ.ఆనంద్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని, ఉన్నత విద్యనభ్యసించే గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ నుంచి రుణాలను మంజూరు, 1/70, పెసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరామన్నారు. రాష్ట్రంలోని గిరిజన గ్రామాలలో పర్యటించి సమస్యలను చూడాలని కోరామన్నారు. బృంద సభ్యులు శశిరేఖ, మహేశ్‌బాబు, దివాకర్ నాయక్, దేవ, ఈశ్వర్‌లాల్, సునీల్‌కుమార్, జ్యోతి ప్రియ పాల్గొన్నారు.


చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యతో ఏబీవీపీ గిరిజన విద్యార్థుల బృందం

జాంకారమ్మ సన్నిధిలో జీసీసీ చైర్మన్


కిండంగిలో అమ్మవారికి మొక్కుతున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కిండంగి పంచాయతీ కేంద్రంలోని జాంకారమ్మ దేవతను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. పురాతనమైన జాంకారమ్మ దేవతకు ప్రస్తుతం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న ఆయన ప్రత్యేకంగా దర్శించుకున్నారు. జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమరణ, సాగర సుబ్బారావు, శశిభూషణ్, సత్యనారాయణ, జి.మురళీ, త్రినాథ్, లక్ష్మణ్, అచ్చిబాబు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

సీలేరు, మార్చి 11 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో జెన్‌కో చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి రవాణా నిరోధించాలని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు శిక్షణ ఎస్ఐలు రెడ్డి వంశీ కృష్ణ, పి శివ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలను జెన్‌కో చెక్‌పోస్టు వద్ద మోహరించి వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

అనంతగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 ఆశ్రమ పాఠశాలలోని బాల, బాలికలకు 3 వేలకు పైగా కళ్లద్దాలను పంపిణీ చేసినట్టు జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తెలిపారు. కొత్తవలస పాఠశాలలోని పీహెచ్‌సీ వైద్యనిపుణురాలు కె.లక్ష్మి ఆధ్వర్యంలోని మంగళవారం విద్యార్థులకు వీటిని అందజేశారు. హెచ్ఎం అప్పలస్వామి, సుబ్బారావు, సోమర, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కాఫీ తోట దగ్ధం

జి.మాడుగుల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొయితిలి పంచాయతీ జీరుగులగొయ్యి గ్రామానికి చెందిన కుశంగి వెంకటరావుకు చెందిన కాఫీ తోట సోమవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ఎవరూలేని సమయంలో ప్రమాదవశాత్తు తోటకు నిప్పు అంటుకున్నట్టు వెంకటరావు తెలిపారు. .

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

పెదబయలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. వివరాలివి..మండలంలోని సీతగుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన బొండా మత్స్యలింగం సోమవారం రాత్రి 10 గంటల సమయంలోసీతగుంట భీమలింగేశ్వర స్వామి జా తరనుచూసేందుకు కాలినకన వెళ్తున్నారు. కుమడకు చెందిన అలీ అక్బర్ (మైనర్) స్కూటీపై వేగంగా వచ్చి ఢీకొనడంతో మత్స్యలింగం కాలికి గాయమైంది.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

జి.మాడుగుల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పాడేరు నుంచి గూడెం కొత్తవీధికి బయలు దేరిన ఆర్టీసీ బస్సు మంగళవారం ఎం.నిట్టాపుట్టు వద్ద మొరాయించడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాంకేతిక సమస్యతో మార్గమధ్యలో బస్సు నిలిచిపోయింది. దీంతో కొద్ది సమయం తరువాత వచ్చిన విజయనగనం- భద్రాచలం బస్సులో ప్రయాణీలకు తరలించారు.

మండల పరిషత్‌లో ప్రతి సోమవారం 'మీ కోసం'

చింతపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్టుఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలపై లబ్ధిదారుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయంపై హర్షం

పెదబయలు/ జి. మాడుగుల: గృహ నిర్మాణాలకు కూటమి ప్ర భుత్వం అదనపు సాయం అందించడంపై రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ కిల్లు వెంకట రమేశ్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులకు రూ. 75 వేలు ఆదిమజాతి గిరిజనులకు రూ. లక్ష అదనంగా సాయం పెంచినట్టు ఆయన వివరించారు.పీహెచ్‌ఏవై, పీఎం జన్‌మన్ గృహాలపై నిధులు పెంచడంపై జి.మాడుగుల టీడీపీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు, పి. భాస్కరరావు, నేత పిన్నరావు హర్షం వ్యక్తంచేశారు.

జెన్‌కో అధికారుల దృష్టికి సీలేరు సమస్యలు


జెన్‌కో ఎస్‌ఈతో మాట్లాడుతున్న తెలుగునాడు నాయకులు

సీలేరు, మార్చి 11 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు యూనియన్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ (సివిల్) శ్రీనివాసరెడ్డిలను కోరారు. ఇటీవల ఎన్నికైన తెలుగునాడు కార్మిక యూనియన్ ప్రాంతీయనాయకులు తొలిసారిగా మర్యాదపూర్వకంగా ఇంజనీర్లను కలిశారు. సీలేరులో కోతుల సమస్యతో స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, వీటిని పట్టించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పారిశద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని , కాంట్రాక్టు కార్మికులు సెలవులను వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అధ్యక్షుడు వి. త్రినాథరావు, కార్యదర్శి రత్నం, రీజనల్ వర్కింగ్ అసిస్టెంట్ కార్యదర్శి ఎస్ భాస్కరరావు, మోతుగూడెం బ్రాంచి ప్రెసిడెంట్ కిరణ్, , సీలేరు బ్రాంచి ప్రెసిడెంట్ ఆర్ అప్పారావు, బ్రాంచి సెక్రటరీ వి. కృష్ణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి కలెక్టర్ ఆర్థిక సాయం

పాడేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పిడుగుపడి మృతి చెందిన బాధిత కుటుంబానికి మంగళవారం కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ జడిగూడకు చెందిన కిల్లో నరసింగరావు(18) గతేడాది ఆగస్టు 18న పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పాటుకు మృతి చెందాడు. మృతుని తలిదండ్రులు కిల్లో లివ్వు, ఆల్మే మంగళవారం కలెక్టర్‌ను కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత అనంతగిరి


విజేతగా నిలిచిన అనంతగిరి జట్టు

అనంతగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హోలీ (పాగును) పండగ సందర్భంగా వారం రోజులుగా కమిటీ సభ్యులు నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి.. మంగళవారం ఎగువశోభ అనంతగిరి జట్లు ఫైనల్స్‌లో తలపడగా.. అనంతగిరి జట్టు ఘన విజయం సాధించింది.. తొలి బ్యాటింగ్ చేసిన అనంతగిరి జట్టు 12 ఓవర్లలో 99 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎగువశోభ జట్టు 9 పరుగుల తేడాతో ఓటమి పాలవడంతో అనంతగిరి జట్టు విజయం సాధించింది.

'1/70 చట్ట సవరణ కుట్రలో భాగమే ఎమ్మెల్యే వ్యాఖ్యలు'

పాడేరురూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1/70 చట్ట చవరణలో భాగంగానే అసెంబ్లీలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి గిరిజనేతరులకు పక్కా గృహాలపై ప్రస్తావించినట్టు గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మన్నపడాల్, బాలదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూశాసన సభలో ఎమ్మెల్యే శిరీషాదేవి..1952 ముందు నుంచి రంపచోడవరం ఏజెన్సీలో నివసిస్తున్న 40శాతంగిరిజనేతరులకు గృహాలు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వాలనడం 1/70 చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు.

రేపటి నుంచి లోతుగెడ్డలో వీరభద్రస్వామి జాతర

చింతపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలలోని లోతుగెడ్డ వీరభద్ర స్వామి జాతర ఈనెల 13 తేదీ నుంచి 15 వరకు నిర్వహించనున్నట్టు స్థానిక సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు చింతర్ల సునీల్ తెలిపారు. మంగళవారం కమిటీ సభ్యులు జాతర పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ జాతర మూడు రోజులు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు అభినందన


కలెక్టర్ దినేశ్‌కుమార్‌నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న క్రీడాకారులు

అరకులోయ/పాడేరు రూరల్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులను కలెక్టర్ దినేశ్‌కుమార్ అభినందించారు. మంగళవా రం పాడేరు కలెక్టరేట్‌లో 15 మంది క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జి ల్లా కార్యదర్శి వంతల కొండబాబు విద్యార్థులు జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ విభాగంలోని ఆర్చరీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పాల్గొన్నట్టు వివరించారు. హ్యాండ్‌బాల్‌లో ద్వితీయ స్థానం సాధించిన వనం గౌరీశంకర్,డిస్కస్‌త్రోలో తృతీయస్థానం పొందిన గుల్లెలు చంద్రశేఖర్ నాయుడును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఇన్‌చార్జి డీడీ రజని, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సూరిబాబు, పీఈటీలు భూపతిరాజు, లింగేశ్వరరావు, కోచ్ సూరిబాబు పాల్గొన్నారు.

రాజ్‌మా కిలో రూ.90కు కొనుగోలు: జీసీసీ డీఎం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చింతపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పండించిన రాజ్‌మా (ఎరుపు) గింజలను జీసీసీ కిలో రూ.90ధరకు కొనుగోలు చేస్తుందని స్థానిక డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు అన్నారు. ఆదివారం 'రాజ్‌మా రైతు డీలా' శీర్షికన వచ్చి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో జీసీసీ కొనుగోలు ప్రా రంభించిందన్నారు. చింతపల్లి మండలంలో 550కిలోల రాజ్‌మా కొనుగోలు చేశామన్నారు. ఎండుపసుపు కిలోరూ.100ధరకుకొనుగోలు చేస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న డీఎం దేవరాజు

అంగన్‌వాడీలకు సమయపాలన తప్పనిసరి: సీడీపీవో

గూడెంకొత్తవీధి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలుసమయపాలన పాటించాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో ఎ.లక్ష్మీదేవి ఆదేశించారు.. మంగళవారం కార్యకర్తలతో సీడీపీవో సమావేశమయ్యారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని, కృష్ణకుమారి పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిరావాలి: ఎమ్మెల్యే మత్స్యలింగం

పెదబయలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాడేరులో బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు నిరసనకు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత తరలి రావాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఈ యువత పోరు ఆందోళన చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు చంద్రుబాబు, కొండబాబు, బాలరాజు, విష్ణుమూర్తి, పద్మాకర్ రావు, తిరుపతిరావు, చంటి, విశ్వనాథం, కొండలరావు పాల్గొన్నారు.

17 నుంచి తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

చింతపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంపై స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గిరిజన రైతులకు ఈనెల 17 నుంచి ఏడు రోజుల పాటు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్టు స్థానిక ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. నేషనల్ బీ బోర్డు సౌజన్యంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.వివరాలకు శాస్త్రవేత్త బీఎస్ సందీప్ నాయక్ ఫోన్: 98851 12564 సంప్రదించాలని కోరారు.

'యువత పోరు' హాస్యాస్పదం'

డుంబ్రిగుడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువత పోరు పేరిట నిరసన తలపెట్టడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక కిడారి సామాజిక భవనంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు.ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో బకాయిపెట్టిన కోట్లాది రూపాయిల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూటమి ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. టీడీపీ అరకు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం, స్వామి, రాజు పాల్గొన్నారు.

విరాళాలతో మైదానం సిద్ధం

అరకులోయ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ గ్రామంలో యువకులు, గ్రామ పెద్దల సహకారంతో క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. వేసవి సెలవులకు దూర ప్రాంతాల్లో చదువుకుంటూ గ్రామానికి వచ్చే విద్యార్థులు ఆటపాటలతో గడపాలనే ఉద్దేశంతో సువిశాలమైన స్థలాన్ని ఎంపిక చేసి జేసీబీతో చదును చేస్తున్నారు. యువకుల విరాళాలతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. గ్రామ యువ నాయకులు, పెసా కమిటీ అధ్యక్షుడు బారికి సుమన్, గుంజిడి ప్రసాద్, అగతమ్మిడి సునీల్, గాజుల రామకృష్ణ, గాజుల ఆనం దరావు ఇందుకు పూనుకున్నారు. తన వంతు సాయంగా రూ. 2500 రమేశ్ అందజేశారు.


మాడగడలో క్రీడా మైదానం పనుల్లో యువత

గ్రామాల్లో సదుపాయాలు కల్పించాలి: సీపీఎం

జి.మాడుగుల, మార్చి (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గ్రామాలకు కనీస సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం కుంబిడిసింగి పంచాయతీలో పాల్గొని మాట్లాడారు. కుంబిడిసింగి పరిధి రాళగెడ్డలో దశాబ్దాల కాలం నుంచి వంతెన సదుపాయం లేక గతంలో ఇదే వాగులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈస్థితిలో వంతెన పూర్తి చేయాలన్నారు. రాళ్లగెడ్డ వాగును పరిశీలించిన ఆయన స్థానిక సమస్యలపై గిరిజనులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ధర్మనపడాల్, దీనబంధు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు మంజూరు చేసిన గృహ నిర్మాణాల వ్యయం రూ. 10 లక్షలకు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు.అడుగులపుట్టి పంచాయతీ తమరడ గ్రామంలోని గృహ నిర్మాణాలను పరిశీలించారు.

గవ్వల మామిడి, సంపంగిపుట్టులకు రోడ్డు నిర్మించాలి

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ గవ్వల మామిడి, సంపంగిపుట్టు గ్రామాలకు ప్రభుత్వం రోడ్డు మంజూరు చేయాలని సీపీఎం నేత, వైస్ ఎంపీపీ ఎస్. కొండలరావు డిమాండ్ చేశారు . మంగళవారం సీపీఎం తలపెట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆయా గ్రామాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు, తాగునీటి రోడ్డు సమస్యలు ఎ దుర్కొంటున్నట్టు స్థానికులు తెలిపారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

» మాతా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ చిన్మయిదేవి


డల్లాపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ సూర్యకుమారి

పాడేరురూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత గర్భిణులు, బాలింతలు సకాలంలో పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాతా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి సూచించారు. మంగళవారం పాడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మండలంలోని డల్లాపల్లి పీవీటీజీ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర ని ర్వాహణ, రికార్డులు, స్టాక్ నిలువలను, ప్రీ స్కూల్ పనితీరు, పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో సమావేశమయ్యారు. తామరాపల్లి, బిరిమిశాల అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎన్.సూర్యలక్ష్మి, సీడీపీవో పి.ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌తో విద్యార్థుల్లో రాజకీయ పరిజ్ఞానం

పాడేరురూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో మాక్ పార్లమెంట్ తదితర కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థులలో రాజకీయ పరిజ్ఞానం పెరుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టబ్బాయి అన్నారు. మంగళవారం కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల చారిత్రక నేపథ్యాన్ని, నేడు సమావేశాలు జరుగుతున్న తీరుతెన్నులను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి వి.రమేశ్‌బాబు, చింతపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి జి.జగదీశ్‌బాబు, సుమిత్ర, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సక్రమంగా వినియోగించు కోవాలి

హుకుంపేట మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులకు సక్రమంగా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో లింగ మూర్తి తెలిపారు.మంగళవారం మండలంలోని మఠం పంచాయతీ కేంద్రంలోని 9 గ్రామాలకు చెందిన ఉపాధి రైతులతో డీఆర్‌పీ హిమగిరి అధ్యక్షతన సామాజిక తనిఖీ వేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ, 2023 -2024లో ఈ పంచాయతీ పరిధిలో కేంద్ర ప్ర భు త్వ నిధులు రూ.70.6.024 లక్షలతో వివిధ పనులు చేపట్టినట్టు వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివక్రిష్ణ టెక్నికల్ అసిస్టెంట్ మోహిని , ఉప సర్పంచి మత్స్య కొండబాబు, పెసా కమిటీ సభ్యుడు నారాయణ పాల్గొన్నారు.

15న మెగా జాబ్ మేళా: కలెక్టర్

పాడేరురూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఈ జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. అత్యంత ప్రతిష్టగల సుమారు 28 సంస్థలు ఈజాబ్ మేళాలలో పాల్గొంటాయన్నారు. 18 ఏళ్లు నిండిన 10వ తరగతి ఆపై ఉన్నత చదువులు డిగ్రీ పూర్తి చేసిన వారు, ఫార్మసీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కూ. 12 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు. జిల్లా నైపుణ్యాధికారి డాక్టర్.పి.రోహిణి, సహాయకులు నవీన్ పాల్గొన్నారు.

హుకుంపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హుకుంపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున 13వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆ మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్ఎం.అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పశు వైద్య శిబిరాలు

గూడెంకొత్తవీధి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకాడ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో మేకలు, గొర్రైలకు డీవార్మింగ్ మందులు వేసినట్టు స్థానిక పశువైద్యాధికారి యు. రాజశేఖర్ తెలిపారు. మంగళవారం సంకాడలో 150 ఆవులకు ఎఫ్ఎండీ టీకాలు, 80మేకలకు డీవార్మింగ్ మం దులు వేశామన్నారు. సిబ్బంది అర్జున్, బాలయ్య, సన్యాసిరావు, గాంధీ, చైతన్య పాల్గొన్నారు.

30న శివలింగం ప్రతిష్ఠ

జి.మాడుగుల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచముఖ ఆం జనేయ స్వామి ఆలయంలో ఈ నెల 30న శివలింగ మహా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ పాయిరాం స్వామీజీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. సమరసత సేవాఫౌండేషన్ సభ్యుడు ఎం.మత్స్యరాజు, అయ్యప్ప ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మీనాయుడు, పూజారి మత్స్య లిం గచారి, సోమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరడ పంచాయతీ సగ్గులు, కొదంజోలా, బిమిడి గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న రోడ్డు పనులకు సర్పంచి పార్వతి, ఎంపీటీసీ సభ్యులు కోడా సబ్బోలు మంగళవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ నిధులు రూ. 5.23 కోట్లతో 5 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో లైకోన్, బుద్దా, బిస్నాట్, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని బలపం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచి కె. రమేశ్ నాయుడు, ఎంపీటీసీ బచ్చులి మచ్చమ్మ శంకుస్థాపన చేశారు. 141మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ రూ.5.7లక్షల నిధులను మంజూరు చేసింది.కూటమి నాయకులు గబులంగి అప్పారావు, నారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి, రాజారావు, గిరి,రమణ, పెసా కమిటీప్రతినిధి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గంజాయి సాగు వద్దు: ఏవో

ముంచంగిపుట్టు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుకు ప్రత్యామ్నాయ పంటలపై గిరిజనులు దృష్టిసారించాలని ఏవో శ్రీనివాసబాబు సూచించారు. మండలంలోని వనగుమ్మ పంచాయతీ డాబుగూడ, సంగడ, పనస గ్రామాల్లో ఈమేరకు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నీలకంఠం, హార్టీ కల్చర్ అధికారి సునీల్‌కుమార్, బుద్దు, లలిత, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

» దేమునిగుమ్మం ఆలయంలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన అర్చకస్వాములు

» భారీగా తరలి వచ్చి వీక్షించిన భక్తజనం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భక్తుల గోవిందనామస్మరణ నడుమ పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు, ప్రసాద్, రాజేష్‌ల ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా ఈ వేడుకను నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తరఫున జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి కల్యాణాన్ని వీక్షించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో టి.రాజసులోచన, ధర్మకర్తలు గోలి మురళీ, వేదుల సూర్యప్రభ, సీహెచ్.నరసింగరావు, కొణతాల అరుణ, సోమాదుల తులసీ, కొణతాల వాసు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఎమ్మెల్యే కొణతాల తరఫున పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న రాంకీ

పి-4 సర్వేను పక్కాగా నిర్వహించండి : సీపీవో

సబ్బవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పేదల స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టిషిపేషన్ (పి-4)సర్వేను మండలంలో త్వరితగతిన పూర్తి చేయాలని సీపీవో జి. రామారావు సూచించారు. సబ్బవరంలో సర్వే జరుగుతున్న తీరును మంగళవారం పరిశీలించారు. సిబ్బంది ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ఏ విధంగా సర్వే చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మండలంలో 18,044 బీపీఎల్ కుటుంబాలు ఉండగా, ఇంత వరకూ 6,976 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్టు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈ సర్వేలో మండలం నాలుగో స్థానంలో ఉన్నట్టు చెప్పారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను పక్కాగా పూర్తిచేయాలని ఎంపీడీవోకు ఆయన సూచించారు.

శివాలయాలకు రూ. 6.11 లక్షల విరాళం



సబ్బవరం శివాలయంలో చెక్కు అందజేస్తున్న రాజు కుటుంబ సభ్యులు

సబ్బవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వర ఆలయానికి రూ.5,11,116, గణపతిపురంలో నిర్మాణంలో ఉన్న మల్లికార్జునస్వామి ఆలయానికి రూ. 1,00.009లను సబ్బవరానికి చెందిన జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు), అనుప్రియాంక దంపతులు, కుమార్తె ప్రణీత మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సదరు కుటుంబ సభ్యులను ఆలయ నిర్మాణ కమిటీల ప్రతినిధులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, బర్ల రమణ, కొల్లి గంగునాయుడు, గెడ్డం కృష్ణ, కేవీ సత్యనారాయణ, ఎస్.నాగేంద్ర ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొరాడ శ్రీను, సబ్బవరపు శివ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి'

పరవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీల ఆరు వారాల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ.బోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలెంలో మంగళవారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. కూలీల వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. పని ప్రదేశాల్లో మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించడంతో పాటు పనిముట్లకు కూడా డబ్బులు చెల్లించాలని కోరారు. రోజుకు రూ. ఆరు వందలు వేతనం చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బొద్దపు అప్పలరాజు, సూరమ్మ, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరిన ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కార్మికులపై తప్పుడు కేసులు రాసిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ సెక్రటరీ జి.శంకర్రావు డిమాండ్ చేశారు. ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట అసోసియేషన్ ప్రతినిధులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 11వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ అన్యాయంగా సస్పెండ్ చేసిన డ్రైవర్, కండక్టర్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో ఎ.అన్నపూర్ణ, టి.సలోమి, జి. భవాని, డీఎం కుమారి కూర్చున్నారు. అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ పి.సుధాకర్, అనకాపల్లి డిపో అధ్యక్షులు ఏఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో న్యాయ వర్సిటీ విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ చూపారు. కోల్‌కతాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్ (ఎన్‌యూజేఎస్)లో ఈనెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకూ వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో తమ కళాశాల విద్యార్థులు బాస్కెట్‌బాల్, వాలీబాల్ (పురుషులు), త్రోబాల్ (మహిళలు), బ్యాడ్మింటన్, బహుళ ట్రాక్ ఈవెంట్‌లలో బంగారు పతకాలు సాధించారని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. అలాగే, క్రికెట్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, అథ్లెటిక్స్‌లో రజిత పతకాలు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్ ఈవెంట్స్‌లో కాంస్య పతకాలు సాధించారని వీసీ వివరించారు. ఈ సందర్భంగా విజేతలను మంగళవారం ఇక్కడ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ మంగరాజు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్ల పండుగ.. ఆనందం నిండుగా..

» ఊరూరా.. మిన్నంటిన సంబరాలు » భారీగా తరలివచ్చిన భక్తజనం » ఆకట్టుకున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు



తుమ్మపాల కొత్తపేట వీధిలో పోలిపల్లి అమ్మవారు



పరవాడలో పైడిమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు



కశింకోట : గోకువానిపాలెంలో గజ్జలమ్మతల్లికి సురేంద్ర పూజలు



సబ్బవరం: తవ్వవానిపాలెంలో పరదేశిమాంబకు హారతి

పరవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పైడిమాంబ జాతర పరవాడలో మంగళవారం వైభవంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంటన్నర నుంచిదర్శనాలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పసుపు, కుంకుమ, పండ్లు, కాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మీశ్రీనివాస్ దంపతులతో పాటు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, మజ్జిగ, వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఘనంగా ఊరేగింపు జరిపించిన అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పరవాడ డిఎస్పీ వి.విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు బందోబస్తు నిర్వహించారు.

తానాంలో...

తానాం గ్రామంలో పరదేశిమాంబ జాతరను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచ్ పైలా రామారావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించి, ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు.

దేశపాత్రునిపాలెంలో...

జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలోపోలమాంబ పండుగను నేత్రపర్వంగా జరిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో పాటు పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఘటాలను ఊరేగింపు జరిపిన అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తుమ్మపాలలో పోలిపల్లమ్మ వేడుక

తుమ్మపాల : అనకాపల్లి మండలం తుమ్మపాలలోని కొత్తపేట వీధిలో పోలిపల్లి అమ్మవారి జాతర మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలువురు ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు. సాయంత్ర ఏర్పాటైన నేలవేషాలు, చిడతలు, తప్పెట గుళ్లు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోకువానిపాలెంలో గజ్జలమ్మ పండుగ

కశింకోట : మండలంలోని గోకువానిపాలెంలో గజ్జలమ్మ పండుగను మంగళవారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి భక్తుల కోలాహలం ప్రారంభమైంది. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. కూటమి నాయకులు దాడి నాగరాజు, కలగ గోవింద, దొడ్డి నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, ఉల్లింగల రమేష్, నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తవ్వవానిపాలెంలో పరదేశిమాంబ అనుపోత్సవం

సబ్బవరం : తవ్వవానిపాలెంలో పరదేశిమాంబ అనుపోత్సవం మంగళ వారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తుల రాక ఆరంభమైంది. సాయంత్రం నేల డ్యాన్స్‌లు, కోలాటం, చిడతల భజనలతో పాటు అమ్మవారి ఘటాల ఊరేగింపు కన్నుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్త, జనసేన నేత బోకం శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో రాష్ట్రస్థాయి చిడతల పోటీలు, జిల్లా స్థాయి వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఎంపీటీసీ బోకం బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన గుర్రపు పరుగు పందేలను మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, గండి రవికుమార్ ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులు అందించారు. రాత్రికి ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, గ్రామ పెద్దలు బోకం బాలకృష్ణ, బోకం శ్రవణ్‌లతో పాటు ఉత్సవ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దివ్యాంగులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

» ఉపకరణాల పంపిణీలో కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపు

» 'సింహాద్రి ఎన్టీపీసీ' సామాజిక సేవలపై ప్రశంసల జల్లు



దివ్యాంగుల ఉపకరణాల పంపిణీని సింహాద్రి హెచ్‌వోపీ సమీర్‌శర్మతో కలిసి ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లాలో గల భవిత కేంద్రాల్లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు రూ.12.99 లక్షలతో ఉపకరణాలను సమకూర్చింది. వాటిని ఇక్కడి దీపాంజలినగర్‌లో గల సంయుక్త ఫంక్షన్ హాలులో మంగళవారం పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల పురోభివృద్ధికి సింహాద్రి యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాల్సిందిగా ఆమె సూచించారు. అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ సంస్థ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్ట్ (హెచ్‌వోపీ) సమీర్ శర్మ, జిల్లా సమగ్ర శిక్ష అదనపు సంచాలకులు జయప్రకాశ్, జిల్లా సహిత విద్య సమన్వయ అధికారిణి బి.శకుంతల, సింహాద్రి హెచ్ఆర్ విభాగం డీజీఎం టీబీ పాత్ర, జిల్లాలో గల భవిత కేంద్రాల ఉపాధ్యాయులు, దివ్యాంగుల తల్లిదండ్రులు, సీఎస్ఆర్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు పర్యటన

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జిల్లాలో బుధ, గురువారాల్లో పర్యటించనున్నారని జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌకధరల దుకాణాలు, సరకులు పంపిణీ వాహనాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు తనిఖీ చేస్తారన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం కింద పోషకాహార కార్యక్రమాల అమలును పరిశీలించనున్నారని వివరించారు.

కశింకోట ఇన్‌చార్జి తహశీల్దార్‌గా విజయ్‌కుమార్

అనకాపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కశింకోట తహశీల్దార్ శ్రీనివాసరావు అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లారు. ఈనెల ఐదో తేదీ నుంచి 31వ తేదీ వరకు సెలవు పెట్టడంతో అనకాపల్లి తహశీల్దార్ విజయ్‌కుమార్‌కు కశింకోట తహశీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్లకోమాపై అప్రమత్తంగా ఉండాలి

» వ్యాధి నివారణకు అవగాహన సదస్సులు

» ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ప్రత్యేక కంటి పరీక్షలు

» అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ రమణకుమార్



ఎన్టీఆర్ వైద్యాలయంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు డాక్టర్ రమణకుమార్

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్లకోమా వ్యాధి పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్ డాక్టర్ జీవీ రమణకుమార్ సూచించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ వరకు గ్లకోమా వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వారం ప్రత్యేక కంటి పరీక్షలు ఉచితంగా జరపడంతో పాటు ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. ముఖ్యంగా 45 ఏళ్ల పైబడిన వారు, రక్తపోటు, మధుమేహ వ్యాధి ఉన్నవారు, వయో వృద్ధులు తప్పనిసరిగా ప్రతి ఏడాది సంపూర్ణ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనివల్ల కంటి వైద్యులు సమస్యలను గుర్తించడం ద్వారా శాశ్వత అంధత్వం రాకుండా నివారించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు కంటి పరీక్షలను విధిగా చేయించుకోవాలన్నారు.

'సీడాప్' ఆధ్వర్యంలో జాబ్ మేళాలు

అనకాపల్లి రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో ఈనెల 14, 18, 28 తేదీల్లో జిల్లాలోని జాబ్ మేళాలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్టు మైనార్టీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షంషున్నీ షా బేగమ్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని మైనార్టీ వర్గాలకు చెందిన యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగావకాశాలు పొందవచ్చునన్నారు. 14న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, 18న ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎలమంచిలి, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పాయకరావుపేట, 28న ప్రభుత్వ జూనియర్ కళాశాల మాడుగులలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలకు 98499 01159, 0891- 2502271 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఉపాధి హామీ పనులపై 23 వరకు గ్రామ సభలు

కశింకోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం తేగాడ హౌసింగ్ కాలనీలో జరిగిన పనులకు సంబంధించి కొలతలు వేసి, తనిఖీ చేశారు. గ్రామ సభలు పూర్తయిన తరువాత ఈ నెల 24న సామాజిక తనిఖీలపై పబ్లిక్ హియరింగ్ ఉంటుందని వివరించారు.

సస్యరక్షణ చర్యలతో సమృద్ధిగా మామిడి కాపు


» జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు



అమృతపురంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి జి.ప్రభాకరరావు

సబ్బవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడుతుంటే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని అమృతపురంలో మామిడి తోటలను సందర్శించి పూత, పిందెను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మామిడి పూత వచ్చినప్పటి నుంచి చెట్లకు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలన్నారు. పిందె కట్టే దశలో ఉద్యాన శాఖ అధికారులు సూచించిన విధంగా రెండుసార్లు ఎరువులు వేసుకోవాలని చెప్పారు. తేనె మంచు పురుగు నివారణకు బుప్రోఫెజిన్ మందును లీటరు నీటికి 1.5 ఎం.ఎల్. లేదా అసిఫేట్ ఒక గ్రాము లేదా డైనోటేఫ్యూరాన్ 0.2 గ్రాములను మూడు ఎం.ఎల్. వేప నూనె కలిపి పూత, పిందె తడిసేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. తామర పురుగు నివారణకు నీలం రంగు జిగురు అట్టలను చెట్టుకు ఒకటి చొప్పున తరచూ మారుస్తూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెట్ల మొదళ్లలో ఫాలిడాల్/క్లోరోపైరీఫాస్/వేప పిండి వేయడం ద్వారా నిద్రావస్థలో ఉన్న కీటకాలను నిర్మూలించవచ్చన్నారు. పూత, పిందె అధికంగా రాలుతుంటే ప్లానోఫిక్స్ మందును లీటరు నీటికి ఒక ఎం.ఎల్. చొప్పున కలిపి ఉదయం, సాయంత్రం సమయాల్లో పిచికారీ చేసుకోవాలని ఆయన చెప్పారు. ఉద్యాన శాఖ అధికారి హెచ్‌వో ఆర్.కిరణ్మయి, వీహెచ్‌ఏ పి.భావన, రైతులు వున్నారు.

కంటిని కాపాడుకుందాం



» నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం
» 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి
» షుగర్, బీపీ వంటివి ఉన్నవారైతే 35 ఏళ్ల నుంచే...

కంటి చూపును పోగొట్టే గ్లకోమా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
కంటి చూపును మెల్లగా పోగొట్టే వ్యాధి గ్లకోమా. ఆప్టిక్ నాడి దెబ్బతినడం వల్ల 'గ్లకోమా' వస్తుంది. ఏటా గ్లకోమా బారినపడి కంటి చూపు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దేశంలో లక్షలాది మంది గ్లకోమా బారినపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో మార్చి 12న గ్లకోమా డే నిర్వహిస్తున్నారు. ఈ నెల పదో తేదీ నుంచి 16 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఐక్యంగా గ్లకోమా రహిత ప్రపంచాన్ని సాధిద్దాం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

నేడు ప్రపంచ గ్లకోమా డే

గ్లకోమాను నీటికాసుల వ్యాధి అని కూడా పిలుస్తారు. గ్లకోమా బారినపడిన వారిలో కనుపాప వద్ద గల స్రవాల ప్రసరణలో అడ్డంకులు ఏర్పడి కంటి నరం ఒత్తిడికి గురై బలహీనపడుతుంది. దీనివల్ల క్రమంగా దృష్టి తగ్గి అంధత్వం ఏర్పడుతుంది. కంటిలో 12 లక్షల నరాలు ఉంటే అవన్నీ ఒత్తిడిని తట్టుకోలేక రోజుకు రెండు వేల నుంచి మూడు వేల వరకు చనిపోతుంటాయి. దీనివల్ల క్రమంగా చూపు మందగిస్తుంది. సాధారణంగా కంటిపై ఒత్తిడి 15 మిల్లీమీటర్ ఆఫ్ మెర్క్యూరీ (ఎంఎంహెచ్‌జీ) వరకూ ఉండాలి. ఈ ఒత్తిడి ఎంత ఎక్కువైతే అంత వేగంగా అంధత్వం వస్తుంది. 20 ఎంఎంహెచ్‌జీకు చేరుకుంటే ఒత్తిడి పెరిగినట్టు భావించాలి. 40 దాటితే కంటి చూపు పోతుందని వైద్యులు చెబుతున్నారు. 20 దాటినప్పటి నుంచే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. ప్రతి వంద మందిలో నలుగురు గ్లకోమా బారినపడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

నరంపై ఒత్తిడి పెరిగితే...

కంటి ఆకృతిని పరిరక్షించడానికి యాక్వస్ హ్యూమర్ అనే ద్రవం కంట్లో ఉత్పత్తి అవుతుంది. కొత్త ద్రవం ఉత్పత్తి అయ్యే క్రమంలో పాత ద్రవం బయటకు వెళ్తుంది. బయటకు వెళ్లడంలో ఏదైనా అడ్డుపడితే అప్పుడు ఒత్తిడి పెరిగి నరం దెబ్బతింటుంది. దీనినే గ్లకోమా వ్యాధిగా చెబుతారు. ప్రతి ఒక్కరికీ నేరుగానే కాకుండా కొంత పక్కకు చూడగల సామర్థ్యం ఉంటుంది. దీనినే ఫీల్డ్ ఆఫ్ విజన్ లేదా విజువల్ ఫీల్డ్ అంటారు. గ్లకోమా వల్ల ఈ సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుంది. ఇది ఒక్కరోజులో కాకుండా క్రమంగా జరుగుతుంది. అందుకే దీనిని సకాలంలో గుర్తించలేరు. అంధత్వ కారకాల్లో గ్లకోమా మూడో స్థానంలో ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

గ్లకోమాకు అనేక అంశాలు దోహదం..

గ్లకోమా బారినపడేందుకు అనేక అంశాలు దోహదం చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. జన్యుపరమైన కారణాలు, గతంలో కంటి సమస్యలు, అలర్జీ పరిష్కారానికి స్టెరాయిడ్ డ్రాప్‌లు, టాబ్లెట్లు ఎక్కువ కాలం వినియోగించినా గ్లకోమా బారినపడే అవకాశం ఉంది. గ్లకోమా వల్ల ఆప్టిక్ నెర్వ్ (కంటి నెర్వ్) దెబ్బతింటే చూపు వచ్చే అవకాశం లేదు. ఒకసారి గ్లకోమా బారినపడితే కొంతమందిలో రెండేళ్లలో, మరికొంత మందిలో ఐదేళ్లలో



చూపుపోయే అవకాశం ఉంది. కాబట్టి, 40 ఏళ్లు దాటినవాళ్లు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కళ్లలో నీరు కారడం, నల్లగుడ్డు తెల్లగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని పేర్కొంటున్నారు.

ఈ పరీక్షలు తప్పనిసరి..

గ్లకోమా వ్యాధిగ్రస్తులకు సమగ్రమైన కంటి పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇంట్రా ఆక్యులర్ ప్రెజర్ (జీవీటీ ద్వారా), గోనియోస్కోపీ, విజువల్ ఫీల్డ్ టెస్టింగ్, ఓసీటీ వంటి పరీక్షలను నిర్వహించి గ్లకోమాను నిర్ధారిస్తారు. ఎంత శాతం డ్యామేజ్ జరిగిందో నిర్ధారించి చికిత్స మొదలు పెడతారు.

తస్మాత్ జాగ్రత్త..

మధుమేహం, అధిక రక్తపోటు కలిగినవారు, 40 ఏళ్లు దాటినవారు, షార్ట్ సైట్ తరచూ పెరిగేవారు, కుటుంబ సభ్యుల్లో గ్లకోమా సమస్య ఉన్నవారు, స్టెరాయిడ్స్ మందులు వినియోగించేవాళ్లు, దృష్టిలోపంతో బాధపడేవారు, దెబ్బలు తగిలినవారు, స్మోకింగ్ అలవాటు ఉన్నవాళ్లలో గ్లకోమా వచ్చేందుకు అవకాశముంది. సెలక్టివ్ గ్రూపుగా చెప్పే ఇటువంటి లక్షణాలు ఉన్నవారిలో 20 ఏళ్లకే గ్లకోమా వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. ఏడాదికొకసారి గ్లకోమా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఓపీకి 30 మంది..

ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ప్రతిరోజూ నిర్వహించే ఓపీ (అవుట్ పేషెంట్స్)కి సుమారు 300 మంది వరకూ రోగులు వస్తే అందులో గ్లకోమా అనుమానితులు 30 వరకు ఉంటున్నారు. వారిలో నలుగురు నుంచి ఆరుగురికి నిర్ధారణ గ్లకోమా ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. నెలకు ఆరు వేల మంది ప్రాంతీయ కంటి ఆస్పత్రికి వస్తుండగా, ఇందులో గ్లకోమా అనుమానిత కేసులు 500 వరకు ఉంటున్నాయి. వీరిలో 50 మంది వరకు నిర్ధారణ అవుతున్నట్టు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్లకోమా క్లినిక్‌ను ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. గ్లకోమా నిర్ధారణ అయిన వారికి లేజర్ ట్రీట్‌మెంట్, అధికంగా ఉంటే ఐరడక్టమీ చేసి ఒత్తిడి పోయే మార్గాన్ని ఏర్పాటుచేస్తారు.

40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికొకసారి పరీక్షలు చేయించుకోవాలి


- డాక్టర్ వి.మీనాక్షి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్



గ్లకోమాపై అవగాహన ఉంటే లక్షణాలను బట్టి సమస్యను గుర్తించి మెరుగైన వైద్య సేవలు పొందడం ద్వారా కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవడం చాలా అవసరం. బీపీ, షుగర్, దృష్టిలోపం సమస్యతో బాధపడుతున్నవారైతే 35 ఏళ్లు దాటిన తరువాత నుంచి పరీక్షలు చేయించుకోవడం మేలు. సకాలంలో సమస్యను గుర్తించి వైద్య సేవలు పొందడం ద్వారా కంటి చూపు కోల్పోకుండా కాపాడేందుకు అవకాశం ఉంది. గతంతో పోలిస్తే కేసులు సంఖ్య పెరుగుతోంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో స్పెషల్ గ్లకోమా క్లినిక్ నిర్వహిస్తున్నాం.



గ్లకోమా లక్షణాలున్న కన్ను
సాధారణ కన్ను



గ్లకోమా వ్యాధి వ్యాప్తి ఇలా..

నేడు వైసీపీ 'యువత పోరు'



పోస్టర్లను ప్రదర్శిస్తున్న బూడి ముత్యాలనాయుడు, వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, నిరుద్యోగులకు భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం 'యువత పోరు' పేరుతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఇక్కడ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బుధవారం ఉదయం వైసీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, నాయకులు గొర్లి సూరిబాబు, మందపాటి జానకిరామరాజు, మలసాల కిశోర్, మళ్ల బుల్లిబాబు, కేఎం నాయుడు, లక్ష్మి, శోభా పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ఊతం

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. రైతులు తమ వాటా సొమ్ము చెల్లిస్తే, ప్రభుత్వం ఆయా రైతుల తరుపున కంపెనీలకు వెంటనే సబ్సిడీ సొమ్మును జమ చేసి యంత్ర పరికరాలు రైతులకు అందేలా చర్యలు చేపట్టింది. ఐదు ఎకరాల్లోపు భూములున్న రైతులు ఈ పరికరాలు పొందడానికి అర్హులు.

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు పొందాలనుకొనే రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. అక్కడ వుండే వ్యవసాయ సహాయకుడి లాగిన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. మండల వ్యవసాయాధికారి ఆమోదం పొందిన తరువాత యంత్ర పరికరాలు పంపిణీ చేస్తారు. ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు మాత్రమే రాయితీపై యంత్ర పరికరాలు పొందడానికి అర్హులు.

డిగ్రీ చదివిన డ్వాక్రా మహిళల పిల్లలకు నైపుణ్య శిక్షణ

నర్సీపట్నం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం మెప్మా కార్యాలయంలో ఆశ సొసైటీ ఆధ్వర్యంలో డిగ్రీ చదివిన డ్వాక్రా మహిళల పిల్లలకు నైపుణ్య శిక్షణ కోసం పేర్లు నమోదు ప్రక్రియ చేపట్టారు. నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ పథకంలో మంగళవారం మొబైల్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతకు సబ్జెక్టును బట్టి వర్చువల్‌గా శిక్షణ ఇస్తారని మెప్మా సీవో రమాదేవి తెలిపారు. అర్హులైన వారికి నెలకి రూ.4,500 చొప్పున ఏడాదికి రూ.54,000 ఉపకార వేతనం అందజేస్తారని తెలిపారు. శిక్షణానంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. నైపుణ్య శిక్షణకు 275 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవల్సి ఉండగా, తొలి రోజు 200 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు.



ఇంటర్వ్యూలకు హాజరైన యువతీ యువకులు

డి.పట్టా భూములకూ పూర్తి పరిహారం ఇవ్వాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నక్కపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని కాగిత, పాటిమీద, మూలపర్ర, తమ్మయ్యపేట, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట గ్రామాల్లో పర్యటించారు. కారిడార్ నిర్వాసిత రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం డి.పట్టా భూములకు కూడా జిరాయితీ మాదిరిగానే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల భూములతో ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నాయని ఆరోపించారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో సముద్రంలో కాలుష్యం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం, పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నేతలు ఎం.అప్పలరాజు, సత్యనారాయణ, రాజేశ్, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిల పాపం ఎవరిది?

... 5వ పేజీ తరువాయి

ఐదేళ్ల హయాంలో సుమారు ఏడాదిపాటు విద్యార్థులకు ఫీజులను చెల్లించలేదు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక క్వార్టర్ ఫీజును బకాయి పెట్టగా, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క క్వార్టర్ ఫీజు మాత్రమే చెల్లించింది. అది కూడా గడిచిన ఏడాది మార్చిలో ఎన్నికలకు కొద్దిరోజులు ముందు జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. మిగిలిన మూడు క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజులను పట్టించుకోలేదు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారిపోవడంతో విద్యార్థులు మూడు క్వార్టర్స్‌కు సంబంధించిన ఫీజులను నష్టపోవాల్సి వచ్చింది.

జనవరిలో ఫీజులు విడుదల

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కూటమి ప్రభుత్వం జనవరిలో భారీగా నిధులు విడుదల చేసింది. గత ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులు, తల్లి అకౌంట్‌కు కాకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీ యాజమాన్యాలకు చెల్లించింది. స్కాలర్‌షిప్‌లను మాత్రం విద్యార్థుల అకౌంట్లకు జమ చేసింది. మిగిలిన బకాయిలను దశల వారీగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గడిచిన ఐదేళ్లు ఉన్నత కోర్సులు చదివిన విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ ప్రభుత్వం.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పోరు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇదిలావుండగా ఆందోళన కార్యక్రమం నిర్వహణపై వైసీపీలో కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు సక్రమంగా ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందిపెట్టి.. ఇప్పుడు ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం

... 5వ పేజీ తరువాయి

జరిగే తీరును ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ గాయత్రీదేవి కళ్లకు కట్టినట్టు వివరించారు. హోం మంత్రి అనితతోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని అద్యంతం తిలకించారు. ఎదురు సన్నాహ మహోత్సవం అనంతరం అర్ధరాత్రి 12.30 గంటలకు వేంకటేశ్వరస్వామి రథోత్సవం ప్రారంభమైంది. తొలుత రథంలో స్వామివారిని అలంకరించిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణతో మాడవీధుల్లో స్వామివారి రథాన్ని ఊరేగించారు. రథోత్సవం అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపైకి ఉభయ దేవేరులతోపాటు వేంకటేశ్వరస్వామిని తోడ్కొని వచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, రాజగోపాలచార్యులు, పవన్‌కుమార్ వేదమంత్రోచ్ఛరణలు, చతుర్వేద పఠనంతో అర్ధరాత్రి 2.15 గంటల నుంచి తెల్లవారుజామున 4.15 గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. గోవిందనామస్మరణతో ఆలయం మార్మోగింది. హోం మంత్రి అనిత, కుటుంబ సభ్యులతో కలిసి కల్యాణాన్ని తిలకించారు.

బాబోయ్ దోమలు!

... 5వ పేజీ తరువాయి

ప్రజారోగ్య విభాగం వారు సిబ్బంది కొరత కారణంగా పారిశుధ్య పనులను పూర్తిస్థాయిలో నిర్వహించడంలేదు. వీధుల్లో చెత్తాచెదారాన్ని రోజూ తొలగిస్తున్నప్పటికీ, మురుగునీటి కాలువలను శుభ్రం చేయడంలేదు. ఓపెన్ కాలువలు కావడంతో చెత్తాచెదారం.. ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోతున్నాయి. పారిశుధ్య సిబ్బంది కొరత కారణంగా వారానికి ఒక రోజు కూడా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో మురుగు నీరు ఎక్కడిక్కడ నిలిచిపోవడం, కాలువలు నిండిపోతే రోడ్లపైకి ప్రవహించడం సర్వసాధారణంగా మారింది. ఈ కారణాల వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పోనీ దోమల నియంత్రణకు మందులు ఏమైనా పిచికారీ చేస్తారా అంటే.. అదీ మొక్కుబడి తంతే! దీంతో దోమల కాటు నుంచి ప్రజలే తమను తాము కాపాడుకోవాల్సి వస్తున్నది.

కాగా పట్టణంలో మురుగు కాలువలను సరిగా శుభ్రం చేయకపోవడం, దోమలబెడద అధికంగా వుండడంపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. కాలువలను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మలేరియా విభాగం ద్వారా డ్రైనేజీ కాలువల్లో యాంటీ లార్వా ఆపరేషన్ జరిపిస్తామని తెలిపారు.

క్రైం... crime news

బెట్టింగ్‌లతో అప్పులపాలై ఆత్మహత్య

గొలుగొండ మార్చి, (ఆంధ్రజ్యోతి)11: మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు విజయవాడలో బెట్టింగుల్లో పాల్గొని అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన కొరుప్రోలు సురేశ్(20) కొంత కాలంగా విజయవాడలో ప్రైవేటు వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే అక్కడ ఆన్‌లైన్ బెట్టింగుల్లో పాల్గొని అప్పుల బారిన పడ్డాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పురుగుల తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం చిన్నయ్యపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు.

29 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు

పాయకరావుపేట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 29 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనువాసు తెలిపిన వివరాలిలా వున్నాయి. కేశవరం శివారు రాజవరంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి 18 లీటర్ల సారాను సీజ్ చేశారు. శ్రీరాంపురం శివారులో ఒక వ్యక్తి నుంచి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పాయకరావుపేటలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి ఒకరి నుంచి ఐదు లీటర్ల సారాను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టులో హాజరుపరిచిన అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు సబ్‌జైలుకు తరలించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

» బంగారం, రెండు బైక్‌లుస్వాధీనం



నిందితుడు, చోరీ సొత్తుతో డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత ఏడాది డిసెంబరు 15వ తేదీన కొత్తూరు పంచాయతీ పరిధిలోని సుబ్బారావు దాబా వద్ద రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి రూ.40 వేల నగదు, 53 గ్రాముల బంగారం వస్తువులు అపహరించుకుపోయారు. గత ఏడాది సెప్టెంబరు ఒకటో తేదీన సత్యనారాయణపురంలో, ఫిబ్రవరి 13వ తేదీన పట్టణంలోని నత్తెమ్మతల్లి ఆలయ ముఖద్వారం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. వీటిపై అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీలకు పాల్పడిన వ్యక్తి రావికమతం మండలం కొత్తకోట శివాలయం వీధికి చెందిన మొగలుతుర్తి మణికంఠగా గుర్తించారు. ఇతని కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు మంగళవారం ఉదయం కొత్తూరు పంచాయతీ రామాపురం కాలనీ సమీపంలో ఏలేరు కాలువ వద్ద పట్టుకుని అరెస్టు చేశారు. ఇతని నుంచి 42.65 గ్రాముల బంగారం వస్తువులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మీడియా సమావేశంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు, జరిమానా

విశాఖపట్నం (లీగల్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి హత్యకు గురైన కేసులు నేరం రుజువు కావడంతో ముద్దాయికి పది సంవత్సరాల కారాగార శిక్ష, రూ.1,75,000 జరిమానా విధిస్తూ విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం తీర్పు చెప్పారు. హతుని కుటుంబానికి రూ.1,60,000 పరిహారంగా ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పోలీస్ స్టేషన్ పరిధి బూరుగుచెట్టు గ్రామానికి చెందిన గెమ్మిలి లక్ష్మయ్యకు ముగ్గురు భార్యలు. మొదటి భార్య కుమారుడైన విజయకుమార్‌కు, మూడో భార్య తమ్ముడైన పొంగి బుల్లిరాజుకు కుటుంబ తగాదాలు ఉన్నాయి. 2019 ఏప్రిల్ 17న లక్ష్మయ్య గ్రామస్థులతో సమావేశమై ఇటుకల పండగ గురించి మాట్లాడుతుండగా ఆయన కుమారుడైన విజయకుమార్ వచ్చి తండ్రి చొక్కా పట్టుకుని ఇంటికి లాక్కుపోసాగాడు. దీంతో అక్కడే ఉన్న బుల్లిరాజు అడ్డుకున్నాడు. అయినా వదలకపోవడంతో పక్కనే వున్న కర్రతో విజయకుమార్ తలపై కొట్టాడు. గాయపడిన విజయకుమార్‌ను పాడేరు ఆస్పత్రికి, అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ విజయకుమార్ మృతిచెందాడు. పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో బుల్లిరాజుకు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

లిక్విడ్ గంజాయితో యువకుడి అరెస్టు

కె.కోటపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లిక్విడ్ గంజాయి రవాణా చేస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఏ.కోడూరు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆనందపురం జంక్షన్ వద్ద మంగళవారం మధ్యాహ్నం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గుంటూరుకు చెందిన షేక్ మహమ్మద్ జాకీర్ బ్యాగులో 900 గ్రాముల లిక్విడ్ గంజాయితో వస్తుండగా పట్టుకున్నారు. లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం

» కె.కోటపాడుకు చెందిన ఒకరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన కామేశ్వరరావు, విరిగిన విద్యుత్ స్తంభం

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై విద్యుత్ స్తంభం విరిగిపడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.కోటపాడుకు చెందిన బి.కామేశ్వరరావు(37) ఉపాధి కోసం మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై విశాఖ డెయిరీకి బయలుదేరాడు. బెల్ హెచ్‌పీసీఎల్ వద్దకు చేరుకుని డివైడర్ పక్కన వాహనం నిలిపాడు. అప్పటికే అక్కడ నాతయ్యపాలేనికి చెందిన డి.సత్యవతి (55) డెయిరీ వద్దకు వెళ్లేందుకు వేచి ఉంది. ఈ సమయంలో గాజువాక నుంచి నగరంలోకి వెళుతున్న ఆర్టీసీ బస్సుకు, రోడ్డు పక్కన తుప్పుపట్టిన ఇనుప విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు తగిలాయి. దీంతో ఒక్కసారిగా స్తంభం కూలి కామేశ్వరరావు, సత్యవతిలపై పడింది. కామేశ్వరరావు తలకు తీవ్ర గాయాలవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకోగా, సత్యవతి తలకు, చేతికి గాయాలయ్యాయి. కామేశ్వరరావును కేజీహెచ్‌కు, సత్యవతిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కామేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419